ప్రజాశక్తి
కడప
ఆదివారం
జనవరి- 7
2018
పేజీలు : 12

జన్మభూమిలో ప్రజా సమస్యలపై నిలదీస్తాం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు



12లో

- అలివి వల స్మగ్లర్లపై దాడులపై దృష్టి
- ఐదుగురితో బృందం నియామకం
- వేట ముమ్మరం చేసిన కడప, నెల్లూరు జిల్లాలు

చేపల స్మగ్లింగ్ నిరోధానికి టాస్క్‌ఫోర్స్



జిల్లాలో చేపల స్మగ్లింగ్ నిరోధానికి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైంది. కడప-నెల్లూరు జిల్లాలతో సరిహద్దులు కలిగిన సోమశిల రిజర్వాయర్ వెనుకజలాల్లో స్మగ్లింగ్ యథేచ్ఛగా సాగుతుండడంపై కలెక్టర్ సీరియస్‌గా దృష్టి సారించారు. నలుగురు సభ్యులతో కూడిన టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేశారు. కడప-నెల్లూరు జిల్లాలు కలిసికట్టుగా జాయింట్ ఆపరేషన్ చేపట్టడంతో స్మగ్లింగ్‌కు ముకుతాడు పడనుంది. దేశంలోనే అరుదైన జాతి చేపలకు సోమశిల రిజర్వాయర్ నిలయం. ఇటువంటి అరుదైన కియోస్క్ జాతి సంపదను కాపాడటానికి ఉపయోగిస్తున్న అలివి వలలను సీజ్ చేయడంతో స్మగ్లింగ్ నిరోధానికి తొలిఅడుగు పడింది. సోమశిల నలుమూలల నుంచి వ్యూహాత్మకంగా వేటను సాగిస్తే పెద్దఎత్తున స్లగ్లర్లను అదుపులోకి తీసుకునే అవకాశాలు అధికంగా ఉన్నాయని తెలుస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో 241 చెరువులను మత్స్య శాఖ గుర్తించింది. సొసైటీల నిర్వహణలోని 80 చెరువులను చేపల సాగుకు ఎంపిక చేసింది. వీటిల్లో ప్రస్తుతం 25 చెరువుల్లో నీటి వనరులు పుష్కలముగా నిల్వ ఉన్నాయి. ఇప్పటికే 20 చెరువుల్లో మత్స్య శాఖ చేప పిల్లలను విడుదల చేసింది. త్వరలో మిగిలిన ఐదు చెరువుల్లో చేపల సాగును చేపట్టడానికి కసరత్తు చేస్తోంది. జిల్లాలోని సోమశిల, వెలిగల్లు, గండికోట రిజర్వాయర్లలో చేపపిల్లలను విడుదల చేసింది. సోమశిల నుంచి దశాబ్దాలుగా యథేచ్ఛగా స్మగ్లింగ్ సాగుతోంది. దేశంలోనే అరుదైన జాతి కియోస్క్ జాతి సంపదను అంతరించిపోతోంది. కియోస్క్ జాతి రకపుచేప సోమశిల, గుజరాత్‌లోని నర్మదా, తమిళనాడు రాష్ట్రాల్లోని మెట్టూరు డ్యామ్‌ల్లో లభ్యమవు తోంది. స్మగ్లింగ్ నిరోధానికి మత్స్య శాఖ ఎడి ఆధ్వర్యంలో ఎక్సైజ్, ఫారెస్టు, రెవెన్యూ, పోలీస్ శాఖలు ఒక్కో అధికారి చొప్పున ఐదుగురితో బృందాన్ని ఏర్పాటు చేసింది. కడప-నెల్లూరు టాస్క్ ఫోర్స్ బృందాలు సంయుక్తంగా స్మగ్లర్లపై వేట సాగించ డంతో స్మగ్లర్లు పట్టుబడుతున్న వైనం కనిపిస్తోంది. ఇదే తరహాలో సోమశిల రిజర్వాయర్ వెనుకజలాల్లోని నెల్లూరు జిల్లాలోని సంగం, కడప జిల్లాలోని అట్లూరు, ఒంటిమిట్ట, నందలూరు మండలాల్లోని వెనుకజలాలను చుట్టుముడితే స్మగ్లింగ్‌కు ముకుతాడు పడనుందనే విశ్లేషణలు ఉన్నాయి. జిల్లా మత్స్య శాఖ 254 మందికి లైసెన్స్‌లు 4లో

గులకరాళ్లలో బంగారం పండుతోంది

రాళ్ల గుండ్లకుంటగా మారిన శేషారెడ్డిపల్లె

800 ఎకరాల్లో అంతా రాళ్లే... అయినా విరగపండుతున్న శనగ

6లో

పూల విరబూత.. శ్రమ ఆరబోత



- చేమంతి ధరలు నేలచూపు
- కనీస పెట్టుబడి చేతికందని వైనం
- ఇబ్బందుల్లో రైతులు

5లో

ఆరుగాలం కష్టపడి సాగు చేసిన రైతు కళ్లలో పూల కాంతులు విరబూస్తాయనుకున్న రైతుకు కష్టాలే చుట్టుముడుతున్నాయి. సాగుపై కన్నకలలు కల్లలవుతున్నాయి. మూడు వారాల క్రితం ఊరించిన ధరలు ఒక్కసారిగా దిగజారి రైతులను ఊసురుమనిపిస్తున్నాయి. ధరలు నేచూపు చూడడంతో వెచ్చించిన పెట్టుబడి చేతికందకుండా పోతోందని ఆవేదన చెందుతున్న పరిస్థితి జిల్లాలోని చేమంతి పూల సాగు రైతులకు ఎదురవుతోంది. చేమంతి పూల సాగు విరివిగా చేపడుతున్నారు. పూల సాగులో మంచి లాభాలు ఉంటాయన్న ఆశతో రైతులు సాగు చేశారు.



ఫలితం దక్కడం లేదు

చేమంతి పూల ధరలు తగ్గడంతో ఫలితం దక్కడం లేదు. నాలుగు ఎకరాల్లో తోటను సాగు చేశాను. మంచి లాభాలు ఉంటాయన్న ఆశతో సాధారణ పంటల నుంచి దృష్టి మళ్లించాను. ఎకరాకు దాదాపు రూ. గరిష్టంగా 60 వేలు ఖర్చు చేశాను. పంట సాగులో వెచ్చించిన పెట్టుబడి కూడా చేతికి అందకుండా పోతోంది. అధికారులు దృష్టిసారించి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూడాలి.

- మధుసూధన్‌రెడ్డి, రైతు, పెండ్లిమర్రి.

'ఉక్కు' సాధనకు పోరాటాలు ఉధృతం

25న హర్తాళ్

ఉక్కు సాధన ఐక్య వేదిక నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న బి.నారాయణ

ప్రజాశక్తి - కడపఅర్బన్

జిల్లాలో ఉక్కు పరిశ్రమ సాధన కోసం పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని ఉక్కు సాధన ఐక్య వేదిక నాయకులు హెచ్చరించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఉక్కు సాధన ఐక్య వేదిక సమావేశానికి నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ బైరెడ్డి రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ బి.నారాయణ, నాయకులు డాక్టర్ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమ సాధనకు ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. జిల్లా ప్రజల ఆకాంక్షలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం 4లో

ఎఐటిఎస్ అధ్యాపకునికి డాక్టరేట్

ప్రజాశక్తి - రాజంపేట



మండల పరిధిలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో హ్యూమానిటిస్ అండ్ సైన్స్ విభాగంలో ఆచార్యునిగా పనిచేస్తున్న సింగమాల హరినాథ్‌రెడ్డికి జెఎన్‌టియు యూనివర్శిటి వారు గణితశాస్త్రంలో డాక్టరేట్ ప్రధానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ పేర్కొన్నారు. గణిత శ్రాస్తంలో 'ఎంహెచ్‌డి ఫ్రీక్వెంట్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్ ఫర్ ఫ్లో ఆఫ్ సెమ్ మెటోనిసా అండ్ నాస్ నిటోనియస్ ఫ్లూయిడ్స్ త్రూ పోరస్ మీడియం' అనే అంశంపై పరిశోధన చేసినందుకు హరినాథ్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేశారన్నారు. ఈ పరిశోధనలోని అంశాలు ఎక్కువగా పెట్రోలియం, కెమికల్స్ ఇండస్ట్రీలలో ఉపయోగిస్తారన్నారు. ఈ పరిశోధనను డాక్టర్ ఎం.సి.రాజు, ఆర్అండ్‌డి సెల్ కో ఆర్‌డినేటర్, ప్రొఫెసర్ ఇ.కేశవరెడ్డిల ఆధ్వర్యంలో పూర్తి చేశారన్నారు. ఎఎటిఎస్‌లో ఐదు సంవత్సరాలుగా పనిచేస్తూ డాక్టరేట్ పొందడం అభినందనీయమన్నారు. ఆయనకు డాక్టరేట్ రావడంపై కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడు చొప్పా గంగిరెడ్డి, వైస్ ఛైర్మన్ యల్లారెడ్డి, చైర్మన్ రామచంద్రారెడ్డి, చొప్ప అభిషేక్‌రెడ్డి, నూకా సుబ్బారెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు.



చర్చి పనులను పరిశీలిస్తున్న బిషఫ్ ప్రసాద్

చర్చి పనులను పరిశీలించిన బిషఫ్

ప్రజాశక్తి-బద్వేలు

పట్టణంలోని మైదుకూరు రోడ్డులోని మదం థెరిస్సా ప్రాంగణంలో చేపడుతున్న చర్చి పనులను కడప, చిత్తూరు జిల్లాల ఆర్‌సిఎం బిషప్ గల్లెల ప్రసాద్ శనివారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న తాత్కాలిక చర్చి పనుల నిర్మాణాలను పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాత్కాలిక చర్చి జనవరి 15వ తేదీనా బిషఫ్ ప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభిస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో విచారణ గురువులు బాలరాజు, సురేష్, ఆరోగ్య రాజు సెక్రటరీ వరప్రసాద్, గొడుగునూరు ప్రతాప్, జార్జి, జోజి, కేశవ, విజయరావు, బాలసౌరి, కిరణ్, ప్రసాద్, జాన్ పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌పై ర్యాలీ

ప్రజాశక్తి - రైల్వేకోడూరు

స్థానిక టోల్‌గేట్ సెంటర్ వద్ద సర్పంచ్ తిప్పన కృష్ణయ్య, ఉప సర్పంచ్ హేమరాజ్, పంచాయతీ సిబ్బంది ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం స్వచ్ఛభారత్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకుంటే ఉచితంగా నగదు అందజేస్తామని చెప్పారు. వాటిని నిర్మించుకోవడం ద్వారా బహిరంగ మల మూత్ర విసర్జనలు చేయకుండా స్వచ్ఛభారత్ ఏర్పాటుకు సహకరించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంఎం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు చందు, కృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు శివశంకర్‌రాజు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

క్రమశిక్షణతోనే ఉత్తమ ఫలితాలు



ప్రతిభ చూపిన విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న మేడా

ప్రజాశక్తి - రాజంపేట

క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు విద్యార్థులు సాధించవచ్చని ప్రభుత్వ విప్ మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ మేడా మల్లికార్జునరెడ్డి, సహారా ఇండియా ఏరియా మేనేజర్ సుదీర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు బిడ్డలపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని వాటిని వృథా చేయకూడదని సూచించారు. ఇక్కడ చదువుకొన్న విద్యార్థులు దేశ, విదేశాలలో ఉన్నత ఉద్యోగాలలో ఉన్నారన్నారు. 2015-16 విద్యా సంవత్సరంలో నాలుగు తరగతుల గదుల నిర్మాణం కోసం రూ. 50 లక్షలు నిధులు మంజూరు చేశామన్నారు. టాయిలెట్ కోసం రూ.6 లక్షలు మంజూరైందన్నారు. ప్రిన్సిపల్ రమణరాజు మాట్లాడుతూ కలకత్తాలో నిర్వహించిన ఇంటర్‌నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ (ఆసియాస్థాయి)లో కళాశాలకు చెందిన మస్తాన్ షరీఫ్, మహేష్‌బాబు, కె.వెంకటజగదీష్‌కుమార్‌లు బంగారు పతకాలు సాధించారని, వై.నవీన్ రజత పతకం సాధించడం అభినందనీయమన్నారు. జాతీయ స్థాయికి 9 మంది విద్యార్థులు, త్రైక్వాండో, బాల్ బ్యాట్మింటన్, వాలీబాల్ క్రీడల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు 35 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆయన బహుమతులను అందజేశారు.

ఎస్ఎఫ్ఐ కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి - రాజంపేట

ప్రొద్దుటూరులో ఈనెల 30,31 తేదీలలో చేపట్టే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఎస్ఎఫ్ఐ నాయకులు మలిశెట్టి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యయనం, పోరాటం అనే నినాదంతో స్వాతంత్ర్య ప్రాజాస్వామ్య సోషలిజం అనే లక్ష్యాలతో 1970 డిసెంబర్ 30న ఎస్ఎఫ్ఐ ఏర్పిడిందన్నారు. ఆనాటి నుండి నేటి వరకు విద్యార్థుల సమస్యలపై అనేక రాజీలేని సమరశీల పోరాటాలను నిర్వహిస్తూ మేధావుల, విద్యార్థుల, తల్లిదండ్రుల మన్ననలను పొందుతూ కోటి 50 లక్షలు సభ్యత్వంతో దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఏర్పడిందని కొనియాడారు. ఎస్ఎఫ్ఐ ఆశయాలకు అనుగుణంగా విద్య, వైద్య, ఉపాధి కోసం జిల్లాలో అనేక నిర్బంధాలను ఎదుర్కొని విద్యార్థుల పక్షాన పోరాటలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సుదీప్, లీలాకృష్ణ, మనికంఠ, నవీన్, సాయి శివయ్యలు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న విజయమ్మ, మహబూబ్‌బాషా

ప్రజాశక్తి-బద్వేలు

పట్టణంలోని ముబారక్ ఉచిత కుట్టుమిషన్ శిక్షణా కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకొన్న 100 మంది ముస్లిం మహిళలకు శనివారం 15, 16 వార్డులకు సంబంధించి తెలుగుగంగ కాలనీలో జరిగిన జన్మభూమి కార్యాక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ చేతుల మీదుగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముస్లిముల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు వీటిని అందజేశామని చెప్పారు. బడుగు, బలహీన వర్గాలలో పేదరికం పోగొట్టాలనే లక్ష్యంతో చంద్రబాబునాయుడు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మహబూబ్‌బాషా మాట్లాడుతూ ముస్లిముల అభివృద్ధి టిడిపితోనే సాధ్యమన్నారు. పట్టణంలో షాదీఖానాకు, ఉర్దూ గ్రంథాలయం కోసం స్థలం ఏర్పాటు చేయాలని సభ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ అసిస్టెంట్ ఇడి హేమచంద్ర, మున్సిపల్ చైర్మన్ పార్థసారథి, కమిషనర్ శివరామరెడ్డి, వైస్ చైర్మన్ శ్రీదేవి, కౌన్సెలర్లు జిలానీ, వెంకటసుబ్బయ్య, సాయిక్రిష్ణ, శ్రీనివాసులు, నాయకులు జహంగీర్‌బాషా, సత్తార్, అన్వర్, మహమ్మద్‌గౌస్, మున్నా, బిసి రమణ, జగన్ ట్రావెల్స్ రసూల్, మస్తాన్, ఝాన్సీ, శంకర్‌రెడ్డి, అధికారులు, కుట్టుమిషన్ నిర్వాహకులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-బద్వేలు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జయరాములు పేర్కొన్నారు. శనివారం స్థానిక రాధాక్రిష్ణ కళ్యాణమండపంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మండలంలోని కొత్తచెరువు గ్రామాభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. వెంకశెట్టిపల్లె నుండి కొత్త చెరువు వరకు 11 కిలోమిటర్ల రోడ్డు కోసం ప్రతిపాదనలు డిఇకి పంపామని చెప్పారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి అక్కడి చెరువుకు నీరు వచ్చే మార్గం కూడా చేస్తామన్నారు. బద్వేలు నియోజకవర్గంలో ఆన్‌లైన్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, అర్హులు ధరఖాస్తు దరఖాస్తులు చేసుకుంటే పరిష్కరిస్తామని పే ర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఆన్‌లైన్ చేయాలని తహశీ ల్దార్లకు ఆదేశించామని తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు కొంకుల రాంబాబు, గోపవరం జడ్పీటీసీ వేముల రమణయ్య, గొడుగునూరు క్రిష్ణ, రమణ, రవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయరాములు



మొక్కలు నాటుతున్న మేడా

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ సాధ్యం

ప్రజాశక్తి - రాజంపేట

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్ మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఫ్లై ఒవర్ బిడ్జిపై సహారా ఇండియా ఏరియా మేనేజర్ సుదీర్‌రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ పట్టణంలో వాహనాల సంఖ్య ఘననీయంగా పెరిగి, గాలి కాలుష్యం ఏర్పడి అనారోగ్యానికి ప్రజలు గురవుతున్నారన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం సహారా ఇండియా ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఆ సంస్థ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు చేరువైందన్నారు. ఆర్‌డిఒ వీరబ్రహ్మం, టిడిపి జిల్లా మహిళ అధ్యక్షురాలు శ్రీవాణిలు మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని ఆకాంక్షించారు. మున్సిపాలిటీవారు మొక్కలకు ప్రతి నిత్యం నీరు పట్టి వాటి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి లక్ష్మీనారాయణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సుధాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చమర్తి సురేష్‌రాజు, కమిషనర్ రమణారెడ్డి, బాసినేని వెంకటేశ్వరనాయుడు, హస్తవరం ఉమామహేశ్వరరెడ్డి, ఎంఇఒ చెంగల్‌రెడ్డి, సాయిప్రసాద్, సహారా ఇండియా బ్రాంచ్ మేనేజర్ విశ్వనాథరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో విద్యార్థులు తయారు చేసిన వస్తువులు

కళలపై మక్కువ తప్పనిసరి

ప్రజాశక్తి - నందలూరు

నేటి విద్యార్థులకు కళలపై మక్కువ తప్పనిసరిగా ఉండాలని జ్యోతిబా బిసి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ జయమ్మ పేర్కొన్నారు. శనివారం స్థానిక పాఠశాలలో ఆర్ట్‌అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయులు ఎస్.వెంకటకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల వస్తువులపై ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జయమ్మ మాట్లాడుతూ రాష్ట్ర వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలల కార్యదర్శి కృష్ణమోహన్ ఆదేశాల మేరకు ఈనెల 1 నుండి 6వ తేది వరకూ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఉత్సవాలు నిర్వహించామని అన్నారు. చివరి రోజున విద్యార్థులు తయారు చేసిన వస్తువులను ప్రదర్శించి బెస్ట్ ఆఫ్ త్రీని ఎంపిక చేస్తామన్నారు. విజేతలకు ఈనెల 26వ తేదిన గణతంత్ర దినోత్సవ సందర్భంగా బహుమతులను అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపల్ ఆంజనేయరాజు, ఉపాధ్యాయులు వీరాంజనేయులు, ఎంఎన్ ఆనందబాబు, సుగుణమ్మ, పద్మ, కోటేశ్వరి, సుజనశ్రీ, కంప్యూటర్ ఆపరేటర్ ప్రశాంత్, సిబ్బంది రమణ, నాగభూషణం, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - సిద్దవటం

మండల పరిధిలోని మిట్టపల్లె గ్రామానికి చెందిన దాదినేని చెన్నయ్యకు శని వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాల య్యాయని ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు. మాధ వరం గ్రామ పంచాయతీ శివారులోని చామండే శ్వరిపేట సమీపంలో కడప వైపు నుంచి కడపకు చెందిన ఆర్‌టిసి వస్తున్న బస్సు చామండేశ్వ రిపేట సమీపంగా రాగానే బస్సు, ద్విచక్రవా హనం ఎదురెదురుగా వచ్చి ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో చెన్నయ్యకు తీవ్రగాయాలయ్యా యి వైద్యం కోసం కడప రిమ్స్‌కు ఎస్ఐ తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరు పతికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-బద్వేలు

ప్రభుత్వ పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని టిడిపి బిసి నాయకులు కొలవలివేణుగోపాల్ పేర్కొ న్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 14 వార్డు విద్యానగర్‌లోని బిసి కాలనీలో చంద్రన్న సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్ర మంలో నాయకులు గొల్లపల్లి పుష్పరాజ్, శ్రీని వాసులు, మురళి, పాదలి రాజా, తిరుమల కొండయ్య, నాగయ్య, రమణయ్య, రంగయ్య, సుబ్బయ్య, వెంకటలక్ష్మీ, సరస్వతి పాల్గొన్నారు.

ఉపాధి కోసం కుట్టుశిక్షణ కేంద్రాలు

ప్రజాశక్తి - కలసపాడు

మండలంలోని నిరుద్యోగ మహిళల ఉపాధికోసం కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశామని రైన్‌బో ఫౌండేషన్ ప్రతినిధులు వీరరాజు, స్టేట్ కో ఆర్డినేటర్ లక్ష్మణ్‌రాజులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని బాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళ ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలోని మహిళలకు ఉపాధి కల్పించడానికే వాటిని ఏర్పాటు చేశామన్నారు. మహిళలను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడా నికి సహాయ సహకారం అందించిన బాస్ సంస్థకు ఆయన అభినందనలు తెలియజేశారు. అనంతరం టైలరింగ్ మిషన్‌లో ఉన్న మెలుకవులు నేర్చుకొని స్వశక్తితో ముందుకు నడవాలని ఆయన ఆకాంక్షించారు. మహిళలు కార్యక్రమంలో బాస్ సంస్థ అధ్యక్షులు యోహాన్, ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్స్ మాణిక్యమ్మ, శైలజ, బాస్ సంస్థ కో ఆర్డినేటర్‌లు కె.శేఖర్‌బాబు, తిమోతి, మండల మహిళ ప్రతినిధులు రమాదేవి, మహిళ ఆర్గనైజర్లు సగిలి విజయమ్మ, కె.రాధా, లీలావతి, ఎస్.గీత పాల్గొన్నారు.

నాణ్యమైన మాంసాన్ని విక్రయించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర చైర్మన్ ప్రకాష్‌నాయుడు

ప్రజాశక్తి - రైల్వేకోడూరు

పట్టణంలో నాణ్యమైన మాంసాన్ని మాత్రమే విక్రయించాలని రాష్ట్ర మాంస ఉత్పత్తుల అభివృద్ధి శాఖ చైర్మన్ చంద్రదండు ప్రకాష్‌నాయుడు అన్నారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాంసపు దుకాణ దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ పశువైద్యాధికారితో కోళ్లు, పొట్టేళ్లు, మేకపోతులు పరిశీ లించిన అనంతరం వాటిని విక్రయానికి సిద్ధం చేయాల్సి ఉం టుందని అన్నారు. నిబంధనలు అతిక్రమించి విక్రయాలను నిర్వ హిస్తే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. నాసిరకమైన మాంసం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం డ్వాక్రా మహిళలతో మహిళ నెలకు రూ.10 వేలు సంపాదన వచ్చే విధంగా, కూరగాయలు తయారీ, మాంసం సరఫరా చేసేం దుకు అవకాశం కల్పిస్తోందని అన్నారు. మాంసం విక్రయదారులు కలిసికట్టుగా ఉండి ఒకే ధరతో విక్రయించాలని చెప్పారు. ప్రతి ఏడాదీ లైసెన్స్‌లు రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిప్పన కృష్ణయ్య, ఉప సర్పంచ్ హేమరాజ్, పశువైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్‌బాబు, పంచాయతీ ఇఒ శివశంకర్‌రాజు, మాంసం వ్యాపారులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - రైల్వేకోడూరు

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ అన్నారు. శనివారం స్థానిక లీలా స్పోకెన్ ఇంగ్లీష్ సెంటర్‌లో ఎస్ఎఫ్ఐ 24వ జిల్లా మహాసభల పోస్టర్లు జిల్లా కమిటీ సభ్యులు పెనుబడి సందీప్‌కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 30, 31వ తేదిన జిల్లాలోని ప్రొద్దుటూరులో ఈ మహాసభలు జరుగుతాయని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు హాజరై భవిష్యత్ కార్యచరణపై చర్చిస్తారని అన్నారు. 1970 డిసెంబరు 30న ఎస్ఎఫ్ఐ ఏర్పడినప్పుడు నుండి నేటి వరకు విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తూ మేధావులు విద్యార్థుల మన్ననలను పొందులూ కోటి 50 లక్షల సభ్యత్వంతో దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘంగా నిలబడడం గర్వకారమణ చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు హరి, కార్యదర్శి మణి, శివ, శీను పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థులపై ఒత్తిడి పెంచడం అన్యాయం



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-బద్వేలు

ప్రయివేటు పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులపై స్టడీ అవర్స్ పేరుతో ఒత్తిడి పెంచడం అన్యాయమని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్ని అన్నారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులపై ఒత్తిడి పెంచి వారి ఆత్మహత్యకు కారణమ వుతున్నారని ఆరోపించారు. రాత్రి 10గంటల వరకు పాఠశాలల్లో ఉంచుకొని వారిని మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని విమర్శిం చారు. రాత్రి సమయంలో విద్యార్థులు ఇంటికి వెళ్లే సమయంలో ప్రమాదాలు జరిగే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. వెంటనే ఈ ప్రయివేటు కళాశాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు రవి, చక్రి, భరత్ పాల్గొన్నారు.

10న జీసస్ స్కూల్ వార్షికోత్సవం

రాజంపేట : ఈనెల 10వ తేదీ బుధవారం స్థానిక ఇన్‌ఫ్యాంట్ జీసస్ పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యా యురాలు త్రిషా పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా రెవరెండ్ డాక్టర్ ప్రసాద్, రెవరెండ్ బాలస్వామి, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఎంఇఒ చెంగల్‌రెడ్డి, పట్టణ సిఐ యుగంధర్, డాక్టర్ సుధాకర్, పాదర్ బి.రవీంద్రనాధ్‌లు హాజరవుతున్నారన్నారు.

నాలుగేళ్లగా సమస్యలు పరిష్కారం కాలేదు

ప్రజాశక్తి - రాజంపేట

జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో నాలుగేళ్లగా సమస్యలు పరిష్కారం కాలేదని జన్మభూమి కమిటి సభ్యులు, మాజీ కౌన్సిలర్ మనుబోలు వెంకటేశ్వర్లు, మనుబోలు వెంకటసుబ్బయ్యలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పట్టణ పరిధిలోని 9, 14 వార్డులలో గ్రామ సభ నిర్వహించారు. అనంతరం వార్డు సభ్యులుపలు సమస్య లపై అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు సంజీవరావు, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సుధాకర్, చంద్రమౌళి, లయన్ అబ్దుల్లా, ఇడిమడకల కుమార్, వెంకటసుబ్బానాయుడు, సానే శేఖర్, డాక్టర్ మునిభాగ్యం, టిపిఒ బాలాజీ, ఎఇ సుబ్రమణ్యం పాల్గొన్నారు.



రాజంపేటలో సమస్యలపై మాట్లాడుతున్న కౌన్సిలర్

ఓబులవారిపల్లె ఆరోగ్యమే మహాభాగ్యమని వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు అన్నారు. శనివారం చిన్నంపల్లెలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమం సర్పంచ్ ఏనుగుల శేషయ్య, ఎంపిడిఒ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి రమణయ్య, సీనియర్ టిడిపి నాయకులు బ్రహ్మయ్య, సిహెచ్ఒ సురేంద్రరాజు, పిహెచ్ఎన్ మెహరూన్, పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మంటపంపల్లెలో శనివారం సర్పంచ్ నారాయణ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ వీరబ్రహ్మం మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసమే ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్డు నిర్మించుకోవాలన్నారు. అనంతరం చంద్రన్న సంక్రాంతి కానుకలు, పింఛన్ అందజేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ కృష్ణయ్య, తహశీల్దార్ శిరీషా, ఎంపిడిఒ వెంకటప్రసాద్, కట్టా నారాయణ, కొమరా వెంకటనరసయ్య, గడ్డం జనార్ధన్‌రెడ్డి, పాల్గొన్నారు.

క్రైం న్యూస్



నిందితులను చూపిస్తున్న డిఎస్‌పి కృష్ణన్

హత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి- జమ్మలమడుగు

డిసెంబర్ 26వ తేదీనా పట్టణంలోని మూడు రోడ్ల కూడలి సమీపంలోని బొరుగుల బట్టీలో జరిగిన అమూల్యా హత్య కేసులో కసిరెడ్డి ఓబులరెడ్డి, మాల కొండారెడ్డి, సాయం చేసిన నాగేంద్ర అనే ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని జమ్మలమడుగు డిఎస్‌పి కోలా కృష్ణన్ తెలిపారు. శనివారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమూల్యను తన భర్త అయిన కసిరెడ్డి ఓబులరెడ్డి, మామ మాల కొండారెడ్డిలు కలిసి కుటుంబ సమస్యల కారణంగా పథకం పన్ని భర్తకు ఏమీ తెలియనట్లుగా బెంగుళూరుకు పంపించి ఆమెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారు. ఈ కేసులో బొరుగుల బట్టీలో నమ్మకంగా పని చేస్తున్న నాగేంద్ర రూ. లక్షలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. అందుకు ముందుగానే రూ. 20 వేలు చెల్లించారు. అయితే నిందితులు పరారీలో ఉండటంతో శనివారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుచామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు అర్బన్ సిఐ ప్రవీణ్‌కుమార్, పెద్దముడియం ఎస్ఐ హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి - చిట్వేలి

మండల పరిధిలోని నాగవరం పంచాయతీ దేవరాయపల్లెకు చెందిన కూని చిన్నమ్మ (56) స్వగృహంలో అనుమానస్పద స్థితిలో ఉరివేసుకొని ఆత్మహత్య పాల్పడింది. తమ చిన్నాయనే కూని శ్రీనివాసులు తమతల్లిని హత్య చేసి ఆత్మహత్యగా సృష్టించారని మృతురాలి కుమార్తె అరుణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ డాక్టర్ నాయక్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అయితే మూడు రోజుల క్రితమే ఆమె మృతి చెందివుండవచ్చని పోలీసులు అభిప్రాయపడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఆస్తి తగాదాలే మృతికి కారణమని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఆటో బోల్తా - డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - గాలివీడు

నూలివీడు నుంచి గాలివీడుకు ఆటో వస్తుండగా పశువులవాండ్లపల్లె వద్దకు రాగానే బోల్తా పడటంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు నూలివీడు పంచాయతీ వడ్డపల్లెకు చెందిన పఠాన్ హుసేన్‌ఖాన్ (35) ఆటోలో వెళ్తుండగా పశు వులవాండ్లపల్లె వద్ద ప్రమాదవశాత్తు బోల్తా పడటంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆయన అక్కడిక్కడే మృతి చెందారు. స్థానికులు గుర్తించి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మరణవార్త తెలియగానే కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు.



ప్రమాదంలో మృతి చెందిన హుసేన్‌ఖాన్

మొదటి పేజీ తరువాయి

టాస్క్‌ఫోర్స్

మంజూరు చేసింది. లైసెన్స్‌దారు సగటున ఆరు వలలను ఉపయోగిస్తారనే అంచనాతో వలకు రూ.100 చొప్పున రుసుముతో రూ.610 చెల్లింపులతో జీవనోపాధి నిమిత్తం లైసెన్స్ మంజూరు చేస్తోంది. ఈలెక్కన రూ.1.54 లక్షల చొప్పున ప్రభుత్వానికి ఆదాయం లభించింది. ప్రతిఏటా మే నుంచి ఆగస్టు మధ్య గుడ్డు దశ నడుస్తోంది. ప్రభుత్వం చేపల వేటపై నిషేధం విధిస్తోంది. ప్రభుత్వ నిషేధాన్ని స్మగ్లర్లు బేఖాతర్ చేస్తూ రిజర్వాయర్ నెల్లూరు సరిహద్దుల్లో తిష్టవేసి స్మగ్లర్లు యథేచ్ఛగా అలివివలలతో స్మగ్లింగ్‌ను సాగించడం ఆనవాయితీగా మారింది. దేశంలోనే అతి అరుదైన జాతి చేప రకాలను సేకరించి ఎండబెట్టి చెన్నయ్, బెంగళూరుకు యథేచ్ఛగా తరలించడంపై దృష్టి సారించాల్సి ఉంది. స్మగ్లింగ్ నిరోధంలో టాస్క్‌ఫోర్స్ ఏమేరకు సఫలీకృతమవుతుందో వేచిచూడాల్సి ఉంది.

పోరాటాలు ఉధృతం

లేదని విమర్శించారు. ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే హర్తాళ్ లాంటి కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రభుత్వం కమిటీల పేరిట కాలయాపన చేస్తుందని చెప్పారు. మరోసారి ప్రజలు మోసం చేయాలని చూస్తుందన్నారు. విద్యార్థులు, యువకులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని పిలుపు నిచ్చారు. ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జోగిరామిరెడ్డి మాట్లాడుతూ సమైక్యాంధ్ర ఉద్యమంలా ఉక్కు ఉద్యమాన్ని ఉధృతంగా తీసుకుళ్లాతామని పేర్కొన్నారు. ఇక్కడి యువత ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలసలు పోతున్నారని చెప్పారు. ఉక్కు పరిశ్రమ సాధనకై ఉక్కు పిడికిలై పోరుబాట పడదామని పిలుపు నిచ్చారు. డిగ్రీ కళాశాలల అసోసియేషన్ నాయకులు రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం కారణంగానే యువతకు చదువుకున్నా ఉద్యోగాలు రావడం లేదని పేర్కొన్నారు. ఉపాధి పరిశ్రమలు కావాలని చెప్పారు. ఇక్కడే లక్షల మందికి ఉపాధి నిచ్చే పరిశ్రమలు వస్తే వలసలు ఆగిపోతాయని తెలిపారు. హెచ్‌ఎం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ఎన్‌జిఓ సంఘం జిల్లా అధ్యక్షులు కె.వి.శివారెడ్డి, అపుస్మా జిల్లా అధ్యక్షులు ఎం.వి.రామచంద్రారెడ్డి, ఎన్‌టియు రాష్ట్ర నాయకులు ఇలియాస్, బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి సగిలి గుర్రప్ప, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, హేతువాద సంఘం జిల్లా కార్యదర్శి సి.ఆర్.వి.ప్రసాద్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, ఉక్కుసాధన నాయకులు పుల్లయ్య, నరసింహులు, సునీల్, లక్ష్మీనారాయణ, జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, యువజన సంఘాలు, వివిధ కళాశాలల కరస్పాండెంట్లు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడాలి

ప్రజాశక్తి - గాలివీడు

విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఎస్ఐ మంజునాథ పేర్కొన్నారు. శనివారం బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఎస్. అనిత ఆధ్వర్యంలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ మంచి సూచనలు, సలహాలు పాటిస్తూ మెలగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - లక్కిరెడ్డిపల్లె

జిల్లాలోని గ్రంథాలయాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామకోటిరెడ్డి అన్నారు. శనివారం మండల గ్రంథాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. నూతనంగా గ్రంథాలయ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రామకోటిరెడ్డి మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డిని ఆయన స్వగృహంలో కలిసారు.

జన్మభూమిలో మాటల యుద్ధం

ప్రజాశక్తి - రాయచోటిటౌన్

కొత్తపేట రామాపురంలో 15,16,17,18 వార్డులకు సంబంధించి శనివారం నిర్వహించిన జన్మభూమి సభలో అధికార, విపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం నెలకొంది. సభలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గం వైఎస్ హయాంలోనే అభివృద్ధి చెందిందని అన్నారు. టిడిపి నేత రమేష్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే జనం మధ్యకు వెళ్లి అర్జీలు స్వీకరించడంతో రమేష్‌రెడ్డి ఎమ్మెల్యేపై ఆగ్రహించారు. సభను చెడగొట్టేందుకు వచ్చారని ఆరోపించారు. ఎమ్మెల్యే ప్రసంగాన్ని అడ్డుకొన్నారు. దీంతో సభలో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు రంగంలోకి దిగడం, మున్సిపల్ కమిషనర్ వివరణ ఇవ్వడంతో సమస్య సద్దుమనిగింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నసిబున్‌ఖానం, కో ఆప్షన్ సభ్యులు సలావుద్దీన్, వైసిపి నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గాజుల ఖాదర్‌భాషా పాల్గొన్నారు.

వీరబల్లిలో...

వీరబల్లి మండలానికి సాగు, తాగునీరు అందించేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్ మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం గురప్పగారిపల్లెలో జరిగిన జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పేదలకు చంద్రన్న కానుక, రేషన్‌కార్డులు, స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి మహిళా అధ్యక్షురాలు మల్లెల శ్రీవాణి, మండల టిడిపి అధ్యక్షులు వీరనాగిరెడ్డి, ఎంపిపి స్వప్న, రామక్రిష్ణమరాజు, కుళాయిరెడ్డి పాల్గొన్నారు.

సుండుపల్లెలో...

మండలంలోని గుండ్లపల్లె, బాగంపల్లె గ్రామ పంచాయతీలలో జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంపిడిఓ సుధాకర్‌రెడ్డి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శివారెడ్డి, స్పెషల్ ఆఫీసర్ రంగయ్య, ఎఇ ప్రసాద్, పిఆర్ఎఇ ప్రభాకర్‌రాజు, ఇఒపిఆర్‌డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

వేంపల్లిలో...

పాములూరులో తహశీల్దార్ ప్రభాకర్‌రెడ్డి, మండల అభివృద్ధి అధికారి వెంకటరమణయ్య, అయ్యవారిపల్లె గ్రామంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులరెడ్డి, ఆధ్వర్యంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ ప్రభావతమ్మ, ఇఒపిఆర్‌డి శేఖర్‌నాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మధుసూదన్, సర్పంచ్ నారాయణ, వ్యవసాయాధికారి జోష్న పాల్గొన్నారు.

గాలివీడులో...

బోరెడ్డిగారిపల్లెలో సర్పంచ్ అలిమాభాను ఆధ్వర్యంలో ఎంపిడిఓ వెంకటసుబ్బయ్య జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. 27 దరఖాస్తులు అందాయి. పందికుంటలో తహశీల్దార్ భవానీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో 12 దరఖాస్తులు వచ్చాయి.

విద్యార్థుల గృహాలు సందర్శన



విద్యార్థి పుస్తక పఠనాన్ని పరిశీలిస్తున్న ఉపాధ్యాయ బృందం

ప్రజాశక్తి - గాలివీడు

ఇంటి వద్ద విద్యార్థుల చదువులు ఎలా ఉన్నాయో తెలుసుకొనేందుకు గాండ్లపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయ బృందం సాయంత్రం వేళల్లో సందర్శిస్తున్నారు. శనివారం గాండ్లపల్లెలో పర్యటించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ మాసానికి పాఠ్యాంశాలు పూర్తి అయ్యాయని తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థులను టీవీలకు, పనులకు దూరంగా ఉంచి సాయంత్రం, తెల్లవారుజామున చదివే విధంగా చూడాలన్నారు. ఈ ఏడాది కూడా 10కి 10పాయింట్లు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, రెడ్డెన్న, రామక్రిష్టారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

అంధులకు నిత్యావసరాల వితరణ

ప్రజాశక్తి-పులివెందుల

స్థానిక వికలాంగుల కార్యాలయంలో శనివారం అంధుల లిపి ప్రధాత లూయీ బ్రెయిలీ వర్ధంతిని పురస్కరించుకుని బియ్యంతో పాటు నిత్యావసరాలు, మైకుసెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా లూయీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పులివెందుల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పురుషోత్తమరెడ్డి మాట్లాడుతూ లూయీ బ్రెయిలీని స్పూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. అంధులమని కలతపడాల్సిన అవసరంలేదన్నారు. లూయీ ప్రసాదించిన లిపి ద్వారా ఎంతో మంది అంధులు ఉన్నతస్థాయి చదువులు పూర్తి చేసి వివిధ రంగాలల్లో నైపుణ్యం సాధించారన్నారు. అంధులకు ఎంతో చేయూతనందించిన లూయీ బ్రెయిలీ విగ్రహాన్ని ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, అంతర్జాతీయ మానవ హక్కుల వితరణ సంఘం జిల్లా నాయకురాలు పాయసంపల్లె ఆదిలక్ష్మి పాల్గొన్నారు.



వితరణ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే పురుషోత్తమరెడ్డి

'పవర్ లిఫ్టింగ్'కు ట్రిపుల్ ఐటి విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లి

తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో నేటి నుంచి 12వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి జూనియర్, మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటి విద్యార్థులు పాల్గొననున్నట్లు డైరెక్టర్ భగన్నారాయణ తెలియజేశారు. కృష్ణాజిల్లా జగ్గయ్యపేటలో నవంబర్ 17 నుంచి 19 వరకు జరిగిన ఏపి స్టేట్ జూనియర్, మాస్టర్స్ పోటీలలో విద్యార్థులు పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. కె. నరేంద్ర 53 కేజీల విభాగం, టి. పార్వతీశం 74 కేజీల విభాగం, డి. హరీష్‌కుమార్ 83 కేజీల విభాగంలో, బాలికలలో కె. లక్ష్మి 43 కేజీల విభాగంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. మాస్టర్స్ విభాగంలో బాలగోవిందు తివారీ 83 కేజీల విభాగంలో పాల్గొనున్నట్లు తెలిపారు.



అంగన్‌వాడి సెంటర్‌ను ప్రారంభిస్తున్న మేడా

అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన 'మేడా'

ప్రజాశక్తి - వీరబల్లి

మండలంలోని గురప్పగారిపల్లె పంచాయతీలో రూ. 10 లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాలను శనివారం రాజంపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మేడా మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాల నుండి అంగన్‌వాడీ భవనం లేక విద్యార్థులు అద్దె భవనంలో విద్యను అభ్యసిస్తుండేవారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు మల్లెల శ్రీవాణి, మండల అధ్యక్షులు వీరనాగిరెడ్డి, స్థానిక నాయకులు రామక్రిష్ణమరాజు, సర్పంచ్ నరసింహులు, తహశీల్దార్ నారాయణరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ మురళీధర్‌రెడ్డి, ఎంపిడిఓ జనార్ధన్‌రావు, ఎంపిపి స్వప్న, వెంకటరామిరెడ్డి, కుళాయిరెడ్డి, పద్మనాభరెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

నేడు 5కె రన్

ప్రజాశక్తి - వేంపల్లి

మండల కేంద్రమైన వేంపల్లిలో నేడు జరగనున్న 5కె రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి వెంకటరమణయ్య కోరారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా 5కె రన్ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఉదయం 9 గంటలకు నాలుగు రోడ్ల కూడలి నుంచి బస్టాండు, కడప, పులివెందుల బైపాస్ నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో జన్మభూమి స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులరెడ్డి, తహశీల్దార్ ప్రభాకర్‌రెడ్డి, ప్రభుత్వ కార్యాలయల ఉద్యోగులు, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. మండల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎస్ఐ

ప్రజాశక్తి - వీరబల్లి

సంక్రాంతి సందర్భంగా ఏర్పాటుచేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే విశ్వనాథరెడ్డి జ్ఞాపకార్థం టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ రాజేంద్రనాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి తెలిపారు. గెలుపొందిన వారికి రూ. 10,116 అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దస్తగిరిరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడలతో ఒత్తిడి దూరం

ప్రజాశక్తి - గాలివీడు

విద్యలో ఒత్తిడి లేకుండా ఉండేందుకు క్రీడలు ప్రధాన భూమికను పోషిస్తాయని బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెడ్డెన్న పేర్కొన్నారు. శనివారం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. పీడీ వెంకటేష్‌నాయక్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమ శిక్షణ అలవరుచుకోవాలని పేర్కొన్నారు. కబడ్డీ, త్రోబాల్, వాలీబాల్, ఖో ఖో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధాక్రిష్ణ, గోపాల క్రిష్ణానాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

పూల విరబూత.. శ్రమ ఆరబోత



ప్రజాశక్తి - కడప సిటీ ప్రతినిధి

జిల్లాలో చేమంతి సాగు దాదాపు 37,482 ఎకరాల్లో పంట సాగైంది. ప్రధానంగా పెండ్లిమర్రి, సికెదిన్నె, రాయచోటి, చిన్నమండ్లెం, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో రైతులు విస్తారంగా పంట సాగు చేశారు. పెండ్లిమర్రి మండలంలోనే అత్యధికంగా 2,035 ఎకరాల్లో పంట సాగవుతోంది. జిల్లాలో ప్రస్తుతం దాదాపు 14,993 మెట్రిక్ టన్నుల పూల ఉత్పత్తి ఉంటోంది. పంట విపరీతంగా చేతికి వస్తున్నప్పటికీ ధర మాత్రం పూర్తిగా దిగజారింది. గతంలో బాగానే ధరలు పలకడంతో రైతుల ఆనందించారు. ముఖ్యంగా గత ఇరవై రోజుల క్రితం కిలో చేమంతి పూల ధర రూ.100 నుంచి రూ.110 వరకు పలికింది. ఇటీవల ఈ ధరలు పూర్తిగా నేలచూపు చూస్తున్నాయి. ప్రస్తుతం కిలో రూ.30కి దిగజారింది. రైతు కళ్లలో ఆనందపు కాంతులు కనుమరుగవుతున్నాయి. ఎకరాలో పూలుకోయడానికి ఒక్కో వ్యక్తికి కూలీ రూ.250 చెల్లించాల్సి వస్తోంది. ఎకరాకు దాదాపు 20 మంది కూలీలు అవసరమవుతున్నారు. ప్రస్తుతం ఎకరాకు ఒక కోతలో రూ.500 కిలోలు దిగుబడి ఉంటోంది. ఎకరాకు రూ.15 వేలు మాత్రమే లభిస్తోంది. కేవలం కూలీలకు మాత్రమే రూ.ఐదు వేలు ఖర్చవుతోంది. పూలను ప్రధానంగా బెంగుళూరు, చెన్నయ్ వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. 30 కిలోల పూల బుట్టకు రవాణా చార్జీల కింద రూ.150 ఖర్చవుతోంది. పూల మార్కెట్‌లో దళారులు నూటికి రూ.15 ముట్టజెప్పుకోవాల్సి వస్తోంది. పంట కలుపు, మందులు, రవాణాకు కూడా పెద్ద మొత్తంలోనే వెచ్చించాల్సి వస్తోంది. మొత్తంగా చూస్తే అన్ని ఖర్చులు కలుపుకుని పెట్టిన పెట్టుబడి చేతికి రావడం లేదు. పంట దిగుబడి ఉన్నా రాబడిలేక రైతులు గొల్లుమంటున్నారు. ఆరుగాలం శ్రమించిన రైతులకు తగిన ఫలితం దక్కక పోవడంతో కంటనీరు తిరుగుతోంది. అధికారులు తమ సమస్యపై దృష్టి సారించి తగిన న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఆశలన్నీ ఆవిరయ్యాయి



ప్రస్తుతం దిగజారి పోవడంతో సాగుపై పెంచు కున్న ఆశలు ఆవిరయ్యాయి. రెండెకరాల్లో సాగు చేశాను. ఓ వైపు పంట విరబూసినా ధర వెక్కిరిస్తోంది. మరో వైపు తగ్గిన ధరలు వెక్కిరిస్తున్నాయి. చేసేదేమీలేక కాలం వెల్లదీస్తున్నాం.

- శివారెడ్డి, రైతు, పెండ్లిమర్రి

రైతులను ఆదుకోవాలి

ధరల తగ్గుదలతో నష్టపోతున్న చేమంతి పూల రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి. మార్కెట్‌లో ఎదురయ్యే ఆటు పోటులను నియంత్రిం చడానికి ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలి. రైతుల సాగు ఒడిదుడుకుల నుంచి భరోసా కల్పించాలి.




- దస్తగిరిరెడ్డి, జిల్లా కార్యదర్శి, రైతు సంఘం.

నేడు 72 పంచాయతీల్లో గ్రామసభలు

కడప: ఆదివారం జిల్లాలోని 72 గ్రామ పంచాయతీలు, 24 మున్సిపల్ వార్డులలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బాబూ రావునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గ్రామ సభల్లో తమ సమస్యలకు పరిష్కారం పొందాలన్నారు. అర్జీలు సమర్పిం చేవారు అర్జీలో తప్పనిసరిగా ఆధార్ నెంబరు రాయాల్సి ఉంటుందని తెలిపారు.

గ్రంథాలయ చైర్మన్‌గా రామకోటిరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్మన్

ప్రజాశక్తి - కడపఅర్బన్

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా రామకోటిరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ గతంలో తాను చైర్మన్‌గా పని చేశారనని పేర్కొన్నారు. గ్రంథాల యాల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. భవన నిర్మాణాలు పూర్తి చేశాస్తామని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అహమ్మద్‌బాష రక్తదానం

ప్రజాశక్తి - కడపఅర్బన్

హరున్ బజాజ్ ఎమ్‌డి అహమ్మద్‌బాష రక్తదాన చేశారు. శనివారం ఖూన్ కా రిస్తా బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బజాబ్ షోరూంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హరున్ బజాజ్ గ్రూప్స్ ఎండి అహమ్మద్ మాట్లాడుతూ రక్తదానంతో ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. ఖూన్‌కా రిస్తా సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయని చెప్పారు. రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ఖూన్‌కా రిస్తా అధ్యక్షులు పి.మన్సూర్ అలీఖాన్ మాట్లాడుతూ తమ సంస్థ సభ్యులు రక్తాదానం చేసి ఆపదలో ఉన్నవారికి అందుకుంటున్నారని తెలిపారు. ప్రతి ఇంట్లో ఒకరు రక్తదానం పట్ల అవగాహన పొందితే ఎందరో యువకులకు రక్తదానం పట్ల అవగాహన పెరుగుతుందని చెప్పారు. రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ ఇన్‌ఛార్జీ డాక్టర్ రమేష్‌బాబు, ఖూన్‌కా రిస్తా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.తారిఖ్ అలీ, ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్, కోశాధికారి అబుబకర్, డైరెక్టర్ అంజద్ అలీఖాన్, మస్తాన్, అల్తాఫ్, జిలాన్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న హరున్ బజాజ్ ఎమ్‌డి అహమ్మద్‌బాష

గండికోటలో ఎస్‌ఎఫ్‌ఐ శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - కడపఅర్బన్

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా స్థాయి శిక్షణా తరగతులు ఈ నెల 8,9,10న గండికోటలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు శాస్త్రీయ విద్యా విధానం కోసం చైతన్య నింపేందుకు తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్య ప్రయివేటీకరణ, ఆత్మహత్యలు, విద్యలో మూఢనమ్మకాల ప్రభావం, అధిక ఫీజు వసూళ్లపై ఇప్పటికే జిల్లాలో పెద్దఎత్తున పోరాడుతుంది ఎస్‌ఎఫ్‌ఐ అన్నారు. భవిష్యత్తులో పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. విద్యార్థులకు శిక్షణా తరగతులు ఎంతో దోహదపడతాయని చెప్పారు. విద్యార్థులు హాజరై జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు బి.పవన్ కళ్యాణ్, సాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

హాజరుకాని అధికారులను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - కడప

జన్మభూమిలో హాజరుకాని ప్రభుత్వ శాఖల అధికారులను సస్పెండ్ చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్.నజీర్ అహ్మద్, పిసిసి ప్రధాన కార్యదర్శి సత్తార్, పార్టీ నాయకులు అబ్దుల్‌రౌఫ్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని 25వ డివిజన్‌లో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారం కోసం కాదని, కేవలం టిడిపి ప్రచారం కోసం నిర్వహించే కార్యక్రమంగా మారిందని విమర్శించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరగాల్సిన జన్మభూమి కార్యక్రమం కేవలం ఒక గంటలో తూతూమంత్రంగా జరిపి బిచానా ఎత్తేస్తున్నారన్నారు. అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు హాజరు కావడం లేదన్నారు. హాజరుకానటువంటి వారిని వెంటనే సస్పెండ్ చేయాలని వారు సభలో డిమాండ్ చేశారు.



అభ్యర్థులకు సూచనలు ఇస్తున్న స్టెప్ సిఇఒ మమత

ఆర్మీ ర్యాలీకి 3460 మంది హాజరు

ప్రజాశక్తి - కడప

ఇండియాన్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో భాగంగా శనివారం స్థానిక మున్సిపల్ స్టేడియంలో సోల్జర్ జనరల్ డ్యూటీ కేటగిరి ఎంపికలకు గుంటూరు, అనంతపురం జిల్లాలకు చెందిన 3460 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. సోల్జర్ జనరల్ డ్యూటీ కేటగిరి ఎంపికల ర్యాలీలో పాల్గొనేందుకు 5214 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 3460 మంది మాత్రమే హాజరయినట్లు స్టెప్ సిఇఒ మమత తెలిపారు.ఎంపికల్లో పాల్గొన్న వారికి ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు, డాక్యుమెంటేషన్, పరుగుపందెం పోటీలు నిర్వహించారు. ఎంపికలను స్టెప్ సిఇఒ మమత, జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎం.రామచంద్రారెడ్డి పర్యవేక్షించారు.

నేడు కడపలో 5కె రన్ : జెసి-2

ప్రజాశక్తి - కడప

ఐదవ విడత జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 7న ఆదివారం ఉదయం ఏడు గంటలకు కడప నగరంలో 5కె రన్ నిర్వహిస్తున్నట్లు జెసి-2 శివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని పురస్కరించుకొని కలెక్టర్ బాబూరావు నాయుడు ఆదేశాల మేరకు 5కె రన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రూప్-ఎ, గ్రూప్-బి రెండు విభాగాలుగా విభజించి రెండు మార్గాలలో 5కె రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్ బాలబాలికలు, మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల, ప్రధాన పాఠశాలల విద్యార్థులు, పీడీలు, పిఇటిలు, జిల్లా అధికారులు, ప్రజలు 5కె రన్‌లో పాల్గొంటారని తెలిపారు. గ్రూప్-ఎలో 5కె రన్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నుంచి నెహ్రూపార్కు, ఎస్‌పి బంగ్లా, కోటిరెడ్డి సర్కిల్, సాయిబాబా థియేటర్ మీదుగా ఏడురోడ్ల కూడలి వరకు సాగుతుందని తెలిపారు. గ్రూప్-బి 5కెరన్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మెయిన్ నుంచి ప్రారంభమై క్రిష్ణా సర్కిల్, గోకుల్‌లాడ్జ్, వన్‌టౌన్ సర్కిల్ మీదుగా ఏడురోడ్ల కూడలికి చేరుకుంటుందని పేర్కొన్నారు.

ఎన్‌సిసి క్యాడెట్లకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి - కడప

ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్‌సిసి క్యాడెట్లు అందించిన సేవలను గుర్తించి వారికి ఎంఎల్‌సి రామసుబ్బారెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందించామని కళాశాల ప్రిన్సిపల్ సుబ్బనరసయ్య, ఎన్‌సిసి అధికారులు లెఫ్టినెంట్ డాక్టర్ నీలయ్య, డాక్టర్ మహేష్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. లూయిబ్రెయిలీ జన్మదినం సందర్భంగా నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో వారు ప్రతిభ చూపారన్నారు. ఎన్‌సిసి విద్యార్థులు సమాజ సేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలని పేర్కొన్నారు.

నేడు జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలు

ప్రజాశక్తి - కడప

జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలు ఈ నెల 7వ తేదీన స్థానిక మిస్టర్ ఫిట్ జిమ్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నూనె నగేష్, కార్యదర్శి షేక్ యూనుస్‌బాష ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. రెజ్లింగ్ జిల్లా స్థాయి పోటీలను జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెజ్లింగ్ అసోసియేషన్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలలో ఆల్గొనే క్రీడాకారులు 7వ తేది ఉదయం తొమ్మిది గంటలకు రిపోర్టు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
కడప
ఆదివారం 7
జనవరి 2018

సాహితీ మల్లె...మొల్ల

తెలుగు సాహితీ పూల వనంలో మొల్ల మల్లెలు పూయించింది. మహిళల పట్ల వివక్షత తీవ్ర స్థాయిలో ఉన్న ఆ రోజుల్లో తన పాండిత్య ప్రతిభతో మహిళా సాధికారిత కోసం కృషి చేసింది. తెలుగులో తొలిసారిగా రామాయణ, రచన చేసి, సమకాలీన ప్రబంధ కవులను ఆశ్చర్యచకితులను చేసింది. కవయిత్రి మొల్లను తమ రామాయణ రచనలో అడుగడుగునా స్త్రీ ఔన్నత్యాన్ని చాటుతూ మహిళలు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసి నూతన ఆవిష్కరణకు శ్రీకారం చుట్టాలని సందేశం ఇచ్చింది.

ప్రజాశక్తి – గోపవరం



వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో సరళత్వానికి, లాలిత్యానికి మచ్చుతునక మొల్ల రామాయణం. మొల్ల రామాణం సుందర ప్రబంధం. సంగీత సప్తస్వరాల సమ్మేళనం. తెలుగువారికి వీనులవిందైన విశిష్టకావ్యం.

శాలివాహన కుమ్మరి కులానికి చెందిన ఆతుకూరి మొల్ల కేశనశెట్టి ఏకైక కుమార్తె. అవివాహితగా 1550–1650 మధ్య కాలంలో జీవించి శివకేశవ, అభేదాన్ని పాటించి శ్రీకంఠ మల్లేశ్వరుని, శ్రీరామచంద్రున్ని భక్తిప్రపత్తులతో సేవించింది. 24 వేల శ్లోకాలతో ఆదికవి వాల్మీకి మహర్షి సంస్కృత భాషలో రాసిన రామాయణాన్ని క్లుప్తీకరించి, కేవలం మూడు ఆశ్వాసాలతో 871 పద్యగద్యాలతో స్వతంత్ర రచన చేసింది. బద్వేలుకు ఆగ్నేయ దిశగా ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్ద గోపవరమే మొల్ల జన్మస్థలి అని సుప్రసిద్ధ పండితులు, దివంగత యాదాటి నరసింహశర్మ వాసిన బద్వేలు చరిత్రలో నిర్ధారించియున్నారు. గోపవరంలో రాసిన ఇప్పటికీ మొల్ల పేరుతో ఒక బండ ఉంది. ఆమె ఆరాధించిన ఆశయాలను, తపస్సు చేసిన తిప్పను నేటికి చూడవచ్చు

కవయిత్రి మొల్ల శ్రీకృష్ణదేవరాయుల కాలం నాటిదేనని కేశవపంతులు నరసింహశాస్త్రి మొల్ల రమాయణ పరిమళ కావ్యపీఠకలో నిజ నిర్ధారణ చేసి యున్నారు. క్రీస్తుశకం 1520వ సంవత్సర ప్రాంతంలో కృష్ణదేవరాయుల సభలో ఆమె ప్రవేశించినట్లు చరిత్ర చెబుతోంది. శ్రీకృష్ణదేవరాయులు ఉదయగిరి దుర్గ సందర్శనకు వెళ్తూ మార్గ మధ్యంలో ఉన్న గోపవరంలో బస చేశారట. ఆ సమయంలో మొల్ల రామాయణ కావ్యం వీనులందు చేయడంతో ప్రశంసించి ఆమె ఆరాధించే వీరరాఘవ, శ్రీకంఠ మల్లేశ్వర ఆలయాలకు మాన్యాలు, గోపవరం గ్రామాన్ని సకల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో అనుభవించుకోవాల్సిందిగా ధారాదత్తం చేసినట్లు తెలుస్తోంది. మొల్ల తన రామాయణ రచనలో వినయసంపదను వెల్లడించడమే కాక, తన జన్మస్థలిని, ఆరాధ్యదైవమైన శ్రీకంఠమల్లేశ్వరుని స్మరించింది. కవిత్వం ఎలా చెప్పాలో తెలిసినప్పటికీ తనకేమీ తెలియదని చెప్పడం ఆమె వినయాన్ని సూచిస్తుంది.

గానుగపెంట హనుమంతురావు కృషి


కవయిత్రి మొల్ల గోపవరం మండల వాసి అని తేల్చడంలో గానుగపెంట హనుమంతరావు చేసిన కృషి ప్రశంసనీయం. ఎన్నో అవాంతరాలు, వచ్చినప్పటికీ ఆయన ఆధారాలతో సహా నిరూపించి, మొల్ల గోపవరం వాసేనని తేల్చడంతో పాటు గ్రామాన్ని మొల్ల గోపవరంగా ప్రకటించాలని ప్రభుత్వానికి నివేదికలు పంపారు. మొల్ల పర్యాటక కేంద్రం పేరుతో రూ.1.17 కోట్ల నిధులతో హరితా రెస్టారెంట్ నిర్మాణానికి కృషి చేయడమే కాకుండా మొల్ల పేరుతో తపాలా బిళ్లను కూడా విడుదల చేయించారు. కవయిత్రి మొల్ల పేరుతో లఘు చిత్ర నిర్మాణం చేపట్టారు. ఇంతటి విశిష్టత కలిగిన కవయిత్రి మొల్ల మన ప్రాంత వాసి కావడం, ఈ ప్రాంత ప్రజలకు గర్వకారణం



శిథిలావస్థలో శిలలుగా మారిన శ్రీకంఠమల్లేశ్వర ఆలయం



రచన చేసేందుకు మొల్ల కూర్చొన్న బండ



మొల్ల ఆరాధించిన రామాలయం



మొల్ల పేరుతో ఏర్పాటు చేసిన పర్యాటక కేంద్రం

గులకరాళ్లలో బంగారం పండుతోంది

జమ్మలమడుగు మండలంలో శేషారెడ్డిపల్లె ఎక్కడుంది అని ఎవరైనా అడిగితే చాలా మంది తెలియదంటారు. అదే రాళ్ల గుండ్లకుంటకు ఎటు వెళ్లాలి అని అడిగితే మాత్రం వెంటనే దారి చూపిస్తారు. ఎందుకంటే ఆ గ్రామ పంట పొలాలన్నీ గులకరాళ్లతో నిండి ఉంటాయి. సుమారు రెండు కిలోమీటర్ల వరకు కనుచూపు మేర వ్యవసాయ భూములు రాళ్లతోనే నిండిపోయి కనిపిస్తాయి. ఈ రాళ్ల వల్ల వ్యవసాయానికి ఎలాంటి ఆటంకం ఉండదని ఆ గ్రామ రైతులు చెబుతారు. శనగ పంట మీదే ఎక్కువగా ఆధారపడి గ్రామస్తులు జీవనం సాగిస్తున్నారు. పంట సమయంలో ఈ రాళ్ల వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదని రైతులు చెప్తారు. ఈ గులకరాళ్ల కారణంగా శేషారెడ్డిపల్లికి ఓ ప్రత్యేకత వచ్చింది.

- రాళ్ల గుండ్లకుంటగా మారిన శేషారెడ్డిపల్లె
- 800ఎకరాల్లో అంతా రాళ్లే... అయినా విరగపండుతున్న శనగ
- పంటదిగుబడికి రాళ్లు ఉపకరిస్తున్నాయంటున్న రైతులు



చదును చేసిన పొలంలో కనిపిస్తున్న గులకరాళ్లు

ప్రజాశక్తి – జమ్మలమడుగు :

జమ్మలమడుగు పట్నం నుంచి రైల్వే స్టేషన్ మీదుగా అయిదు కిలోమీటర్ల దూరం వెళితే శేషారెడ్డిపల్లె వస్తుంది. గ్రామానికి ముందు వ్యవసాయ పొలాల్లోని గులకరాళ్లు మనకు స్వాగతం పలుకుతాయి. గ్రామంలో మొత్తం 1200 ఎకరాలు ఉంటే సుమారు 800ఎకరాలు పూర్తిగా గులకరాళ్లతో నిండి ఉంటాయి. ఒకసారి వర్షం వస్తే ఆ నీటితడి చాలా రోజులు వరకు ఉంటుందని రైతులు చెబుతున్నారు. అందుకే పొలం నిండా రాళ్లు ఉన్నా పంటలు బాగా పండుతాయని వారు పేర్కొంటున్నారు. చాలా ఏళ్లుగా గులకరాళ్ల భూముల్లోనే శనగ వేస్తున్నారు. ఎందుకంటే ఇతర పంటలకు సరిపడా నీళ్లు ఇక్కడ లేవు. అందుకే శనగ పంటనే ఇక్కడి పుడమి పుత్రులు నమ్ముకున్నారు. ఓ రెండు కిలోమీటర్ల దూరం వెళితే కానీ నల్లరేగడి భూములు కన్పించవు. అక్కడి పొలాల్లో మాత్రం ఒక్క గులకరాయి సైతం కనిపించక పోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

త్రేతాయుగంలో రాళ్ల వర్షం కురిసిందట..

త్రేతాయుగంలో ఆ గ్రామం ఉన్న ప్రాంతంలో రాళ్ల వర్షం పడిందనీ, అందువల్లే కొంతభాగం రాళ్లతో నిండిపోయిందని అక్కడి పెద్దలు కథలుగా చెబుతారు. గతంలో వ్యవసాయం చేసే సమయంలో రాళ్లను తొలగించినా సేద్యం చేసేటపుడు మరికొన్ని రాళ్లు కన్పించేవనీ, దీంతో వాటి గురించి పట్టించుకోవడం మానేశామని స్థానిక రైతులు చెప్పారు.

వజ్రాల కోసం వేట..

కొన్నేళ్ల కిందట గులకరాళ్ల భూములను పరిశీలించేందుకు వాహనాల్లో కొంతమంది వచ్చేవారు. ఎక్కడ్నుంచి, ఎందుకు వారు వచ్చేవారో స్థానికులకు తెలిసేది కాదు. కొన్నిసార్లు ఈ భూముల్లో హెలికాప్టర్లు సైతం వాలేవని కొందరు స్థానికులు చెప్పారు. గులకరాళ్లను పరిశీలించేందుకు అక్కడక్కడా గుంతలు కూడా తవ్వేవారనీ, వజ్రాల కోసం వెదికేందుకే వారు వచ్చేవారని తర్వాత తమకు అర్థమైందని వారు పేర్కొన్నారు. ఈ భూముల్లో విలువైన ఖనిజాలు ఏమీ లేవని తెలిశాక ఎవరూ ఇటువైపు తొంగిచూడడం లేదని తెలిపారు.



రాళ్ల మధ్య ఏపుగా పెరిగిన శనగపంట



దిగుబడి తగ్గదు

పొలాల్లో గులకాళ్లు ఉండడం వల్ల ఎలాంటి నష్టం ఉండదు. రాళ్లు ఉండడం వల్ల గాలి, వెలుతురు బాగా సోకి దిగుబడి పెరిగే అవకాశం ఉంది. రాళ్ల కింద తడి త్వరగా ఆరిపోదు. అందువల్ల మొక్క కూడా బాగా పెరుగుతుంది

– శివశంకర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి, జమ్మలమడుగు.

దానిమ్మ సాగులో మెలకువలు



ప్రజాశక్తి – చాపాడు

పండ్ల తోటల్లో దానిమ్మ పంట సున్నితమైనది. పూత, పిందె, కాయ దశలో రైతులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా చీడపీడలు ఆశించి తీవ్ర నష్టం జరుగుతుంది. దానిమ్మలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు.

చీని, నిమ్మ, మామిడి, తోటల సాగుకు పనికిరాని భూముల్లో దానిమ్మను లాభసాటిగా పండించవచ్చు. మొక్క ఎంపిక నుంచి కోత దశ వరకు శాస్త్రీయ మెలకువలు పాటించాల్సి ఉంటుంది. మొదటి సంవత్సరంలో ప్రతి మొక్కకు బలంగా పెరిగిన నాలుగు కొమ్మలను కాండాలుగా ఉంచాలి. మిగిలిన కొమ్మలను కత్తిరించాలి. 2–3 సంవత్సరాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ కొమ్మలను పెంచి సరైన ఆకారం తీసుకురావాలి. నేలపైకా పాకిన, గుబురుగా పెరిగిన, నీటి కొమ్మలను కత్తిరించాలి. చెట్టుకు విశ్రాంతి ఇచ్చే సమయంలో చివరి కొమ్మలను 10–15సెం.మీ. పొడవు కత్తిరించి తొలగించాలి. కత్తిరించిన తర్వాత వచ్చిన చిగుర్లలో 2–3 ఉంచి మిగతా చిగుర్లను తీసివేయాలి. ఇలా చేస్తే బలమైన కొమ్మలపై పిందెలు ఏర్పడుతాయి. కాయ పరిమాణం బాగా పెరుగుతుంది. చెట్టుకు 60–80 కాయలు ఉంచి మిగతావి తీసివేస్తే ఉన్న కాయ సైజు, నాణ్యత బాగుంటుంది. కత్తిరింపులకు వాడే కత్తెరలను ఒక శాతం సోడియం హైపోక్లోరైడ్ ద్రావణంలో శుద్ధి చేయాలి.

పూత నియంత్రణ : దానిమ్మకు సంవత్సరం పొడవునా పూత పూసే అలవాటు ఉన్నా, మూడు సీజన్లలో జనవరి–ఫిబ్రవరి, జూన్–జులై, సెప్టెంబర్–అక్టోబరులో ఎక్కువగా పూత వస్తుంది. బాక్టీరియా తెగులు వర్షాకాలంలో ఎక్కువగా ఉంటుంది. సెప్టెంబరు రెండో వారంలో, అక్టోబరు మొదటి వారంలో గాని వచ్చే పూతను నిలపాలి. జూన్ నుంచి నీటితడులు ఆపేయాలి. ఇలా చేస్తే మొక్కలు ఆకులు రాల్చి నిద్రావస్థలోకి వెళతాయి. ఆ తరువాత కత్తిరింపులు చేయాలి. ఎరువులు వేసి నీటితడులివ్వాలి. మొక్కలన్నీ ఒకేసారి పుష్పిస్తాయి. కాయలు ఫిబ్రవరి, మార్చి నెలల్లో కోతకు వస్తాయి. ఈ కాయలకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంటుంది.

పండ్లరసాన్ని పీల్చే రెక్కల పురుగులు : ఇవి పండ్లపై రంధ్రాలు వేసి రసం పీల్చుతాయి. రంధ్రాల్లో శిలీంద్రాలు, బాక్టీరియా చేరి పండ్లు కుళ్లి రాలిపోతాయి. నివారణకు కుళ్లి రాలిపోయిన పండ్లను ఏరి నాశనం చేయాలి. రాత్రివేళల్లో దీపాల కాంతికి పురుగులు ఆకర్షితమవుతాయి. హెక్టారుకు ఒక ఫ్లోరోసెంటు బల్బును కాయలు పక్వానికి వచ్చే నెల రోజుల ముందే ఏర్పాటు చేయాలి. రోజు రాత్రి ఏడు గంటల నుంచి ఉదయం ఆరుగంటల వరకు వెలిగేలా చూడాలి. మలాథియాన్–1 మి.లీ. ఒక శాతం పంచదారను పండ్ల రసంతో కలిపిన మిశ్రమాన్ని దీపాల కింద పెడితే పురుగులు మిశ్రమంలో పడి చనిపోతాయి. పొలంలో కలుపు మొక్కలు తోటచుట్టూ ఉన్న ముళ్ల పొదలను, తిప్ప తీగలను తీసివేయాలి. సాయంకాలం సమయంలో పొగపెట్టి పురుగులను నియంత్రించవచ్చు.

బాక్టీరియా మచ్చ తెగులు: దానిమ్మలో బాక్టీరియా తెగులు అధిక నష్టాన్ని కలుగజేస్తుంది. సాధారణంగా ఈ తెగులు 27–37 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత, 70శాతానికి పైగా గాలిలో తేమ ఉండే పరిస్థితుల్లో తీవ్రంగా ఉంటుంది. తెగులు సోకిన చెట్లకు అంట్లు కట్టడం ద్వారా నర్సరీ దశలోనే ఈ తెగులు వ్యాప్తి చెందుతుంది.

నివారణ :

రోగరహిత అంటు మొక్కలను ఎంపిక చేసుకుని నాటాలి. తెగులు ఆశించిన కొమ్మల భాగాలను అంగుళం కింద వరకు కత్తిరించి దూరంగా కాల్చి వేయాలి. కత్తిరింపుల కోసం వాడే కత్తెరలను ఒకశాతం సోడియం హైపోక్లోరైట్ ద్రావణంలో 30నిమిషాలు ఉంచి శుద్ధి చేసి ఉపయోగించాలి. కత్తిరింపు పనులు పూర్తికాగాలనే ఒకశాతం బోర్డో మిశ్రమాన్ని చెట్లపై పిచికారి చేయాలి. సెప్టెంబరు– అక్టోబరు మాసాల్లో వచ్చే పూతను మాత్రమే పంటకు వదలాలి. నత్రజని, బాస్వరం, పొటాష ఎరువులతో పాటు జింక్, బోరాన్, ఇనుము లాంటి సూక్ష్మధాతువులను వేయాలి. ఇలా వేస్తే మొక్కల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే చెట్టుపై లీటరు నీటికి 200మి.గ్రా.అగ్రిమైసిన్ లేదా స్ట్రెప్టోసైక్లిన్, కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా. కలిపి పిచికారి చేయాలి. తోటలో పరిశుభ్రత పాటించాలి.

ఆసక్తి ఉన్న వారికి క్షేత్రస్థాయిలో సహకరిస్తాం



ఈ పరిస్థితుల్లో సగటు రైతు ఉద్యాన పంటలు వేయడం మేలు. ఆసక్తి ఉన్న రైతులకు అవగాహన కల్పిస్తాం. సాగులో క్షేత్రస్థాయిలో సూచనలు చేస్తాం. సంబంధిత సబ్సిడీలు వర్తించేలా చూస్తాం. దానిమ్మసాగులో రైతు నీటి యాజమాన్యంపై ఎక్కువగా దృష్టి పెట్టాలి. ఔషధ గుణాల దానిమ్మకు ఎప్పుడూ మార్కెట్ ఉంటుంది.

– ఈశ్వరప్రసాద్‌రెడ్డి, మైదుకూరు నియోజకవర్గ హార్టికల్చర్ అధికారి.



దానిమ్మ తోట



తెగులు సోకడంతో దెబ్బతిన్న కాయలు

పెళ్లి బంధం... నమోదుకు దూరం

- ముందస్తు సమాచారంతో పంచాయతీల్లో సులభం
- ధ్రువీకరణ లేకపోతే నష్టం
- చంద్రన్న కానుకలు కష్టం



ప్రజాశక్తి – అట్లూరు

పెళ్లి అంటే కొత్త దుస్తులు అలంకరణలు, విందులు, వినోదాలు, కొత్త బంధుత్వాలు, పచ్చటి తోరనాలు, ఆపై మూడుముళ్లతో ఒకటవుతున్న యువతీ యువకులు సంప్రదాయ పద్ధతులు పాటిస్తున్నారు. ఈ సందర్భంలో చట్టబద్ధ ప్రక్రియలో కాసింత వెనుకబడ్డారు. అవగాహన లోపం, అవసరమొచ్చినపుడు చూసుకోవచ్చనే నిర్లప్తత వెరసి గ్రామ పంచాయతీల్లో పెళ్లి వివరాల నమోదులో వెనుకబడిపోతున్నారు. దీంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి.

పెళ్లి వివరాలను పంచాయతీ పరిధిలోనే నమోదు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. పంచాయతీలు, పురపాలకల పరిధిలో పెళ్లి వివరాలు నమోదైతే చాలా వరకు బాల్య వివాహాలను అరికట్టవచ్చు. పంచాయతీలోల పెళ్లి వివరాలు నమోదు చేసుకోవచ్చన్న అంశం ఇప్పటికే సజిల్లాలో చాలా మందికి తెలియదు. యంత్రాంగం కూడా వీటిపై అవగాహన కల్పించడం లేదన్న విమర్శలున్నాయి.

- చంద్రన్న పెళ్లికానుక నూతన పథకానికి వధూవరుల పెళ్లి ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. దీనికి తోడు జిల్లా నుంచి యువత ఉపాధి నిమిత్తం విదేశాలకు పెద్ద సంఖ్యలో వెళుతున్నారు. ప్రభుత్వ. ప్రయివేటు ఉద్యోగాలు, సైన్యంలో చేరేవారికి పెళ్లి ధ్రువీకరణ పత్రం అవసరం చాలా ఉంది.
- జిల్లాలో 786 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లాలో ఏటా సుమారు 5వేల నుంచి 6500 వరకు పెళ్ళిళ్లు జరుగుతున్నాయని అంచనా.
- నమోదు ప్రకియలో పంచాయతీలు వెనుకబడ్డాయి. గత ఐదేళ్ల వ్యవధిలో జిల్లాలోని 50 మండలాల్లోని పంచాయతీ అధికారులు, 13 మంది జంటలకు మాత్రమే పెళ్లి ధ్రువీకరణ ప్తఆలు మంజూరు చేశారు. డిజిటల్ పద్ధతిలో కాకుండా చేతిరాత ద్వారా కొన్ని పంచాయతీల్లో ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జిల్లాలో 25 జంటలు దరఖాస్తు చేసుకోగా 12 నమోదు పత్రాలు ఇప్పటికీ అపరిష్కృతంగా ఉన్నాయి. వేంపల్లి మండలంలో 8, ఖాజీపేట, కోడూరు, నందలూరు మండలాల్లో ఒకటి చొప్పున, పోరుమామిళ్లలో రెండు పెళ్లిళ్లు నమోదై ఉన్నాయి.
- జిల్లాలో బిసి, ఎసీ, ఎస్టీ వర్గాల పెళ్లిళ్లకు ప్రభుత్వం చంద్రన్న పెళ్లికానుక పథకం కింద ఆర్థిక సహాయాన్ని అందజేయాలని సంకల్పించింది. మండలాల్లో వెలుగు కార్యాలయం పరిధిలో లబ్ధి పొందాలంటే పెళ్లి నమోదు ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అవడంతో దీనిపై లబ్ధిదారులు అవగాహన పెంచుకోవాల్సి ఉంది.
- వివాహాల నిర్బంధ నమోదు' చట్టాన్ని 2002లో తీసుకువచ్చారు. ద్వితీయ పెళ్ళిళ్లు నిరోధించడం, మోసాలను నివారించాలన్న లక్ష్యంతో ఈ చట్టాన్ని తీసుకువచ్చారు. పంచాయతీలు, పురపాలక సంఘాల్లో జనన, మరణాలతో పాటు పెళ్లి నమోదు తప్పనిసరి చేశారు. పంచాయతీ కార్యదర్శి, పురపాలికల్లో అధికారి పెళ్లి అధికారిగా వ్యవహరిస్తారు.
- వరుడికి 21, వధువుకి 18 ఏళ్లు నిండినవారు పెళ్లికి అర్హులు. పెళ్లికి ముందే సంబంధిత పంచాయతీ అధికారికి వినతిపత్రం ఇవ్వాలి. దీని ఆధారంగా కార్యదర్శి పెళ్లి అనంతరం వధూవరుల నుంచి సంతకాలు సేకరించి సాక్షులను గుర్తించి పెళ్లి ధ్రువీకరణ పత్రాన్ని మంజూరు చేస్తారు.

ఢిల్లీ తాకిన మా ఊరి సెగ


ఎంపీ ప్రసంగాన్ని అడ్డుకుంటున్న సిఎం (ఫైల్ ఫొటో)

ప్రొటోకాల్ ఉల్లంఘనపై స్పీకరుకు అవినాష్ ఫిర్యాదు

ప్రజాశక్తి-పులివెందుల

పులివెందులలో ఈ నెల 3న అధికారులు నిర్వహించిన జన్మభూమి-మాఊరు గ్రామ సభ సెగ ఢిల్లీకి తాకింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలోనే ప్రొటోకాల్ ఉల్లంఘన జరిగిందంటూ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి స్పీకరు సుమిత్రా మహాజన్‌కు ఫిర్యాదు చేయడంతో సమస్య మరింత జటిలమవుతుంది. వివరాలిలావున్నాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదో విడత జన్మభూమి కార్యక్రమం సందర్భంగా ఈ నెల 3న పట్టణంలోని ధ్యాన్‌చంద్ క్రీడామైదానంలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి సిఎం చంద్రబాబు హాజరయ్యారు. అదే సమయంలో కడప ఎంపీ అవినాష్‌రెడ్డి కూడా హాజరయ్యారు. ప్రజా సమస్యలపై ప్రసంగించే సమయంలో అర్ధాంతరంగా మైకు కట్ చేశారు. ప్రాజెక్టులపై పొగడ్తలు వద్దని సమస్యలు చెబితే వాటిని పరిష్కరిస్తానని చంద్రబాబు వివరించారు. తాను ప్రజాసమస్యలపైనే మాట్లాడుతున్నానంటూ అవినాష్‌రెడ్డి మాట్లాడుతుండగానే అక్కులుగారి విజయకుమార్ అనే వ్యక్తి మైకు లాగే ప్రయత్నం చేయడంతో పరిస్థితి ప్రతికూలంగా మారింది. ఇదే విషయాన్ని స్పీకరు సుమిత్రా మహాజన్‌కు శుక్రవారం పిర్యాదు చేశారు. ప్రజాప్రతినిధిగా మాట్లాడే అవకాశం ఇవ్వకుండా మైకు లాగే ప్రయత్నం చేయడంతో తాను మనస్తాపానికి గురయ్యానని ఫిర్యాదులో వెల్లడించారు. సభా వేదికపై సుమారు 150మంది వ్యక్తులను ఎలా అనుమతించారని, కలెక్టరు ప్రభుత్వ కార్యక్రమాన్ని టిడిపి సమావేశంలా మార్చారని, ఇందుకు జన్మభూమి కార్యక్రమానికి సంబంధించి ప్రొటోకాల్ ఉల్లంఘించారంటూ ఫిర్యాదు చేశారు. అదే విధంగా అర్బన్ స్టేషన్‌లో రౌడీషీటరుగా నమోదైన అక్కులుగారి విజయ్‌ని సభా వేదికపై ఎలా అనుమతించారో వివరించాలని ఫిర్యాదులో కోరారు. ఇలాంటి సంఘటను పునరావృతం కాకుండా ఉండాలంటే జన్మభూమి గ్రామ సభ ఉల్లంఘనపై విచారించి చర్యలు తీసుకోవాలని సుమిత్రా మహాజన్‌ను ఫిర్యాదులో కోరారు. ఇదే విషయం సోషల్‌మీడియాలో వెల్లడికావడంతో పులివెందుల జన్మభూమి గ్రామ సభ నిర్వహణపై సర్వత్రా చర్చనీయాంశమైంది.

సిపిఎస్ రద్దు చేయాలని వినతి

ప్రజాశక్తి - లక్కిరెడ్డిపల్లె

సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానంను అమలు పరచాలని ఎపియుఎస్ జిల్లా కోశాధికారి నరసింహులు, మండల అధ్యక్షులు బాలరాజు, ప్రధాన కార్యదర్శి నరసింహులు శనివారం జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో సభకు వచ్చిన అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ 1 నుండి అమలు అవుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పదవీ విరమణ అనంతరం ఎటువంటి ఆర్థిక భద్రత లేదన్నారు. వారిపై ఆధారపడిన కుటుంబాలు దుర్భర పరిస్థితి ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విధానాన్ని రద్దు చేయాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.


ఎంపిడిఒకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

సిపిఎస్ రద్దు కోరుతూ 9న ధర్నా

సిపిఎస్ రద్దు చేయాలని కోరుతూ 9న ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎన్‌జిఒ తాలూకా అధ్యక్షులు బలరామరాజు, కార్యదర్శి మల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంట్రిబ్యూటరీ విధానం రద్దు, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ సాధనా సమితి ఆధ్వర్యంలో 9న ఉదయం 10 గంటలకు మండలంలో ధర్నా చేపడుతున్నట్లు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

పాలకవర్గ సభ్యునిగా రాంబసిరెడ్డి

ప్రజాశక్తి - రామాపురం



ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియామకం జరిపిన జిల్లా గ్రంథాలయ సంస్థ పాలకవర్గ సభ్యుడిగా మండలంలోని బండపల్లె పంచాయతీ వెంకటరెడ్డిగారిపల్లెకు చెందిన ఊరగాయల రాంబసిరెడ్డిని నియమించారు. ఈ మేరకు జిల్లా గ్రంథాలయ పాలకవర్గం నియామక ఉత్తర్వుల ద్వారా తెలిపింది. లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్ రెడ్డి, జిల్లా టిడిపి అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి సహకారంతో ఈ నియామకం వచ్చిందని రాంబసిరెడ్డి తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, నియామకానికి కృషి చేసి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రాజకీయ నిరుద్యోగి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లి

ఎంపి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రజాసంకల్ప యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతుంటే అది చూసి ఓర్వలేని తులసిరెడ్డి జగన్ ఎప్పుడూ ముఖ్యమంత్రి కాలేడని విమర్శించడం సరికాదని వైసిపి జిల్లా మైనార్టీ కార్యదర్శి షేక్షావలి విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తులసిరెడ్డి రాజకీయ నిరుద్యోగి అన్నారు. టిడిపి వారు పార్టీలోకి చేర్చుకోరు, బిజెపి వారు దగ్గరకు రానివ్వరని, మునిగిపోయిన కాంగ్రెస్‌పార్టీలో దిక్కు తోచని స్థితిలో తులసిరెడ్డి ఉన్నాడన్నారు.

ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులు

ప్రజాశక్తి-పులివెందుల

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రయివేటు ఆస్పత్రులకు దీటుగా వైద్యసేవలు అందుతున్నాయని, పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నంద్యాల హేమాద్రిరెడ్డి కోరారు. పట్టణంలోని రవీంద్రనాథ్ పాఠశాలలో శనివారం ఐదో విడత జన్మభూమి కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామ సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల కంటే దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను తయారు చేశామన్నారు. సుమారు 11లక్షల రూపాయల విలువ చేసే మైక్రోస్కోప్ పరికరాన్ని ఆస్పత్రిలో ఉంచామన్నారు. సమావేశంలో 15వార్డు కౌన్సిలర్ వరప్రసాద్ 13, 14, 15 వార్డులలో నెలకొన్న సమస్యలను ఏకరుపెట్టారు. రాజకీయాల కతీతంగా ప్రజా హిత కార్యక్రమాలు చేపట్టాలని వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ మదుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

రామాపురంలో...

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, వాటి పురోగతి, అభివృద్ధిని జన్మభూమి కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరవేయనున్నట్లు కడప జాయింట్ కలెక్టర్-1 ఎస్.వి. నాగేశ్వరావు అన్నారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాచపల్లె పంచాయతీలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణంలో గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి ఆర్. రమేష్‌కుమార్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం. రమేష్‌రెడ్డి, ప్రత్యేక అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, తహశీల్దార్ దేవళానాయక్, ఎంపిడిఒ అబ్దుల్ రహీం, ఎఇలు రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్, ప్రతాప్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎపిఎం ధర్మరాజు, సిహెచ్ఒ రామాంజులు పాల్గొన్నారు.


లక్కిరెడ్డిపల్లెలో... రేషన్‌కార్డు అందజేస్తున్న ఆర్‌డిఒ

లక్కిరెడ్డిపల్లెలో...

ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డిఓ దేవేంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని దప్పేపల్లె గ్రామంలో జరిగిన జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చంద్రన్న కానుక, పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి శివప్రసాద్, ఎంపిడిఒ రవికుమార్‌రెడ్డి, తహశీల్దార్ వెంకటరమణ, ఎంఇఒ చక్రేనాయక్, సూపరింటెండెంట్ హైదర్‌వలి, టిడిపి నాయకులు రవిశంకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ తరగతులను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మైదుకూరు

జమ్మలమడుగులో ఈనెల 8, 9, 10 తేదిలలో నిర్వహించే ఎస్ఎఫ్ఐ జిల్లా విద్య వైజ్ఞానిక తరగతులను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటి సభ్యులు పోసిన సుధాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక మైదుకూరు ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గంలోని గండికోట ప్రాంతంలో ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి శిక్షణ తరగతులు జరుపుతున్నట్లు వారు తెలిపారు. ఈ తరగతులకు జిల్లా నుంచి కాక ఇతర ప్రాంత విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు దాదాపు గా 200మంది హాజరవుతున్నట్లు తెలిపారు. సభలో విద్యారంగంలో వచ్చే సంస్కరణలపై వివరిస్తారని చెప్పారు. విద్యారంగంపై ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా విద్యార్థులను భవిష్యత్ పోరాటాలకు సన్నద్ధం చేసేందుకు శిక్షణ ఇస్తారన్నారు. భవిష్యత్తులో విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికలు రూపొందించి ఉద్యమాలకు శ్రీకారం చుడతామని పోసిన సుధాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు సునీల్‌కుమార్, భానుకుమార్ పాల్గొన్నారు.

వెలిగల్లు నీటి కోసం వినతి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లె

వెలిగల్లు ప్రాజెక్టు నుండి లక్కిరెడ్డిపల్లె మండలంలోని బి.యర్రగుడి, దప్పేపల్లె గ్రామాలకు నీటిని మళ్లించాలని ఎపి రైతుసంఘం నాయకులు శ్రీను, శంకర్‌రెడ్డి, పలువురు రైతులు శనివారం దప్పేపల్లెలో జరుగుతున్న గ్రామ సభలో ఆర్‌డిఒ దేవేంద్రారెడ్డికి వినతి పత్రం ఇచ్చారు వెలిగల్లు ప్రాజెక్ట్ అయకట్టు క్రింద 24 వేల ఎకరాలు సాగు, త్రాగు నీటిని అందిస్తాం అని చెబుతున్న ప్రజాప్రతినిధులు హామీలు నిలబెట్టుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేసి సాగు, తాగు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - లక్కిరెడ్డిపల్లె

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, రాయచోటి, గాలివీడు మండలాల్లోని ఐదు గ్రామాలను ఎంపిక చేసి త్వరలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు న్యాయసేవా అధికార కార్యదర్శి యయు ప్రసాద్, జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్‌లు పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణంలో న్యాయవాదులు పారా లీగల్ వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, పారా వాలంటీర్లు గ్రామాలలో ఇంటింటికీ లీగల్, న్యాయసేవలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎపిపి రెడ్డిశేఖర్, న్యాయవాదులు రామచంద్రారెడ్డి, బాలాజీరెడ్డి, చెన్నకృష్ణయ్య, రెడ్డెన్న, పారా వాలంటీర్లు, కానిస్టేబుల్ గంగాధర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు 5కె రన్

ప్రజాశక్తి - లక్కిరెడ్డిపల్లె

జన్మభూమి-మా ఊరు కార్యక్రమం పురస్కరించుకొని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం 7 గంటలకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుండి అనంతపురం గంగమ్మ జాతర వరకు 5 కిలోమీటర్లు 5కె రన్ నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ వెంకటరమణ, ప్రత్యేక అధికారి శివప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని యువత, చిన్న, పెద్దలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పాల్గొనే వారు ఉదయం 7 గంటలకు తహశీల్దార్ కార్యాలయం ముందు హాజరు కావాలని కోరారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి - లక్కిరెడ్డిపల్లె

మండలంలోని శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులతో కలిసి అనంతపురం ఈడిగపల్లె గ్రామంలోని గంగమ్మ జాతర పరిసరాలలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. శనివారం రెండవ రోజు స్పెషల్ క్యాంపు సందర్భంగా పిచ్చి మొక్కలు తొలగించి పరిశుభ్రంగా ఉంచారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ జన్మభూమి మా ఊరు కార్యక్రమం సందర్భంగా స్పెషల్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏడు రోజుల పాటు గ్రామంలో స్వచ్ఛభారత్, ప్రభుత్వ పథకాలు, మరుగుదొడ్లు, పరిశుభ్రతపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శాంతయ్య, సుందరం, విద్యార్థులు పాల్గొన్నారు.


స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

సమస్యల పరిష్కార వేదికే జన్మభూమి

ప్రజాశక్తి- జమ్మలమడుగు

పేద ప్రజల సమస్యలకు పరిష్కార వేదికే జన్మభూమి కార్యక్రమమని ఎంఎల్‌సి, ప్రభుత్వవిప్ పి.రామసుబ్బారెడ్డి అన్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని పెద్దముడి యం మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గ్రామంలో మౌళిక సదుపాయా ల్లో భాగంగా 92 ఇంకుడు గుంతలు, 564 మరుగుదొడ్లు, 94రేషన్‌కార్డులు మంజూరు చేశామన్నారు. కార్పోరేషన్ల ద్వారా ఎనిమిది ట్రాక్టర్లను ఇప్పించామని తెలిపారు. రైతులు బీమా అందలేదని మార్కెట్ యార్డు వైస్‌చైర్మెన్ ఎస్.ఎం. సుధాకర్‌రెడ్డి ద్వారా తమ దృష్టికి తెచ్చారనీ, దీనిపై కలెక్టర్‌తో మాట్లాడామని త్వరలో సమస్య పరిష్కారమవుతుందని చెప్పా రు. కార్యక్రమంలో సర్పంచ్ నాగేశ్వరమ్మ, ఎంపిడిఒ కొండన్న, సిడిపిఒ ముంతాజ్‌బేగం, వెలుగు ఎపిఎం గురకుమార్, పంచాయితీ రాజ్ ఎఇ కమాల్ సాహెబ్, స్పెషల్ ఆఫీసర్ మెప్మా పిడి రామ్‌మోహన్‌రెడ్డి, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

పనులపై అధికారుల నిలదీత

ప్రజాశక్తి - చాపాడు

ఉపాధి పనులను సరిగా చేపట్ట డం లేదని కొంత మంది పొలాల్లో, పంట కాలువల్లో పనులు చేయిస్తూ మిగిలిన వారికి పనులు చూపడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఖాదర్‌పల్లె ప్రజలు అధికారులను నిలదీశారు. శనివారం నిర్వహించిన జన్మభూమి మావూరు కార్యక్రమాన్ని మండల పరిధిలో తహశీల్దార్ ఆధ్వర్యంలో, నాగులపల్లెలో ఎంపి డిఒ ఆధ్వ ర్యంలో గ్రామసభలను నిర్వహించారు. నాగుల పల్లెలో పింఛన్లు, రేషన్‌కార్డు, గృహాల కోసం 30 అర్జీలు, ఖాదర్‌పల్లెలో 35అందాయి. తహ శీల్దార్ పుల్లారెడ్డి మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేస్తామన్నారు. అర్హులైన వారికి పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరయ్యేలా చూస్తామన్నారు. వరి పంటకు బీమా చేసుకునేందుకు 10రోజులు సమయం ఉందనీ, ఎఒ సురేష్‌బాబు తెలిపారు. కార్య క్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఉపమండలాధ్యక్షుడు నరసింహరెడ్డి, మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లు నాయబ్‌రసూల్, ఓబులేసు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.



బియ్యం అందజేస్తున్న సింగరయ్య

బియ్యం వితరణ

ప్రజాశక్తి- జమ్మలమడుగు టౌన్

జ్యోతి మానసిక వికలాంగుల కేంద్రంలో కృపాయుగం మినిస్ట్రీస్ బ్రదర్ వసంత్‌కుమార్ ఆధ్వర్యంలో బియ్యం, కంది బేడలు, నూనె అందించినట్లు మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎం. సింగరయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మానసిక వికలాంగులకు కృపాయుగం మినిస్ట్రీస్ వారు సాయం చేయడం సంతోషమన్నారు. మరి కొందరు దాతలు ముందుకు వచ్చి వికలాంగు లకు సాయం చేయాలని కోరారు. మనకు తెలియకుండా ఎంతో డబ్బు వృథా చేస్తుంటా మని ఇలాంటి సేవా కార్య క్రమాలు చేయడం వల్ల ఆనందం కలుగుతుందన్నారు. కార్యక్రమం లో ఆ సంఘం సభ్యులు ప్రసాద్ బాబు, జ్యోతి మానసిక వికలాంగుల కేంద్రం డైరెక్టర్ సుధాకర్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

భూగర్భ డ్రైయినేజికి నోచుకోని పాత అమృతనగర్



డ్రెయినేజీ వ్యవస్థ లేక రోడ్డుపైకి చేరిన మురుగునీరు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని పాత అమృతనగర్ అండర్ గ్రౌండ్ డ్రెయినేజికి నోచుకో లేదు. ఈ ప్రాంతం పక్కన ఉన్న అమృతనగర్ -1, 2కు అండర్ గ్రౌండ్ డ్రైనేజికి రూ. 8కోట్లు మంజూరైంది. ఇందుకు చెందిన శిలాఫలకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పులివెందు లలో ఆవిష్కరించారు. దాదాపు నెలల కిందట కడపకు చెందిన సంబంధిత అధికారులు అమృతనగర్ -1,2 కు అండర్ గ్రౌండ్ డ్రైనేజికి సంబంధించిన సర్వే నిర్వహించినట్లు స్థానికులు తెలిపారు. డ్రైనేజి విషయమై పాత అమృతనగర్ వాసులు అధికారులను సంప్రదిం చగా ఈ పథకం దిగువన ఉన్న పాత అమృత నగర్‌కు వర్తించదని చెప్పినట్లు స్థానికులు అన్నారు. 2000సంవత్సరంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాంత వాసులకు స్థలాలు కేటాయించారు. అనంతరం వైఎస్ హయాంలో గృహాలు నిర్మించుకున్నారు. పాత అమృతనగర్‌లో 727 గృహాలు, దాదాపు 2500 మంది జనాభా ఉన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ద్వారా మురికి నీటిని మడూరు మురికి కాల్వలోకి వదిలే అవకాశం ఉంది. పాత అమృత నగర్‌కు ఆ అవకాశం లేదని తెలుసు కున్న స్థానికులు తమ ప్రాంతం అండర్ గ్రౌండ్ డ్రైనేజికి నోచుకోకపోవడం బాధాకరమని చెప్పారు. పాత అమృత నగర్ నుంచి దిగువకు చెన్నమరాజుపల్లె చెరువు, కెసి కెనాల్ కాలువ, నాగాయపల్లె, చెరువు ఉన్నప్పటికీ వీటిలోకి మురికి నీటిని పంపేందుకు రైతులు అంగీకరించడం లేదు. ప్రస్తుతం పాత అమృతనగర్‌లో మురికినీటి ద్వారా పారిశుద్యం లోపించింది. భవి ష్యత్తులో కాలువలు నిర్మిస్తే ఈ మురికినీరు ఎక్కడికి వెళ్ళాలనేది ప్రశ్నార్థకమైంది. అధికారులు స్పందించి పాత అమృతనగర్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - చెన్నూరు

పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి తెలుగు దేశం పార్టీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ బాబురాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని రాజినాయపల్లెలో సర్పంచ్ ఎన్‌వి నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జన్మభూమి మాఊరు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మభూమి గ్రామసభలకు ప్రతి ఒక్కరు హాజరై వారికున్న సమస్యలపై అధికారులకు అర్జీలు అందజేయా లన్నారు. కొత్తగా మంజూరైన రేషన్‌కార్డు, ఫించన్లు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ప్రతి కుటుంబానికి చంద్రన్న కానుకను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ పెంచలయ్య, ఎంపిడిఓ మహబూబ్‌బీ, తహశీల్దార్ సత్యానందం, కడప మార్కెట్ యార్డు చైర్మెన్ శివారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, తెలుగుదేశంనాయకులు, పాల్గొన్నారు.

మైదుకూరులో... ప్రజాసమస్యల పరిష్కారానికే జన్మభూమి అని తహశీల్దార్ నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం మైదుకూరు మండలం పప్పనపల్లె గ్రామంలో 5వవిడత జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. మైదుకూరు మున్సిపాల్టి 13, 14 వార్డులలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమానికి మైదుకూరు మున్సిపల్ చైర్మన్ రంగసింహహాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, ఫించన్లు, అందజేశామని చెప్పారు. కార్యక్రమాల్లో జిల్లా విద్యాశాఖ అధికారి శైలజ, మైదుకూరు మండల ఇన్‌చార్జి అభివృద్ది అధికారి రామానుజన్, గృహనిర్మాణ శాఖ అధికారి రామ్మోహన్, కౌన్సిలర్లు పాశం వెంకటసుబ్బమ్మ, పండిటి వెంకటలక్ష్మమ్మ, పాశం మరుతి, పండిటి వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ఏకాంత, విఆర్ఓ లక్ష్మినారాయణ, ఫయాజ్ పాల్గొన్నారు.

సంగీత కళానిధి శ్రీ త్యాగరాజస్వామి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

శ్రీ త్యాగరాజస్వామి సంగీత కళానిధి అని కళాకారులు పేర్కొన్నారు. సంగీత శిఖామణి శ్రీ త్యాగరాజస్వామి 171వ ఆరాధన వేడుకలను శనివారం స్థానిక జానకి సంగీత కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రముఖ గాయకుడు సంగీత విశారద గోపాలకృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ శ్రీ త్యాగరాజస్వామి సంగీత సాగరాన్ని సృష్టించి అబాలగోపాలాన్ని అలరించారన్నారు. 'ఎందరో మహానుభావులు -అందరికీ వందనాలు' అని అనాదు త్యాగరాజ అద్భుతంగా రచించి గానం చేశారన్నారు. త్యాగరాజ స్వామి 24వేల కీర్తనాలు రాసి కలియుగ వైకుంఠుండని కదిలిం చాడన్నారు. త్యాగరాజస్వామి వారి 'పంచరత్న' కీర్తనలు పాడారు. సాహితీ వేత్త గిరి మాట్లాడుతూ త్యాగరాజకీర్తనలు కష్టమైన కీర్తనలు అన్నారు. ఆరవేటి చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ త్యాగరాజస్వామి సంగీత సాగరాన్ని అలంకగా మదించారన్నారు. సూర్యసేవాసంఘం అధ్యక్షుడు షరీఫ్ మాట్లాడుతూ తమిళనాడు లోని తిరువయ్యూర్ క్షేత్రంలో తెలుగు వ్యాగ్గేయకారుడైన త్యాగయ్యకు ఘనంగా నీరాజనాలు అర్పించడం తెలుగు వారి పూర్వ జన్మ సుకృతం అన్నారు. వినయ్ మాట్లాడుతూ సంగీత రంగంలో తొలి గురువు స్థానంలో త్యాగరాజు ఉంటారన్నారు. పొలిశెట్టి వెంకటసుబ్బయ్య ప్రసంగించారు. సంగీత గాయకులు, వాయిద్య కారులు, త్యాగయ్య అభిమానులు పాల్గొన్నారు.

బడి రుణం తీర్చుకోవడం సంతోషకరం

జిల్లా ఉప విద్యాశాఖాధికారి శ్యామలమ్మ

ప్రజాశక్తి- జమ్మలమడుగు

పాఠశాలల్లో చదివి ఆ పాఠశాలలకు ఏదో ఒక రూపంలో రుణం తీర్చుకోవడం సంతోషకరమని జిల్లా ఉప విద్యా శాఖాధికారి కె.శ్యామలమ్మ అన్నారు. శనివారం 'బడి రుణం తీర్చుకుందాం'లో భాగంగా శనివారం నియోజకవర్గం లోని పెద్దముడియం మండలం పెద్దపసుపులలో అదే పాఠశాలలో పని చేస్తున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు వై.చంద్రశేఖర్‌రెడ్డి తన తల్లి దండ్రులు కీ.శే. వై.సి.వెంకటరెడ్డి మాజీ మండల విద్యాశాఖా ధి కారి, కీ.శే. వై.సి.నరసమ్మ జ్ఞాపకార్థం రూ.10వేల విలువ చేసే డిజిటల్ ఫిలిం ప్రొజెక్టర్, అందుకు సంబంధించిన సౌండు బాక్సు లు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా శ్యామ లమ్మ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేయడంలో చంద్రశేఖర్ రెడ్డి ముందుంటాడన్నారు. డిజిటల్ పరికరాలు ఉపయోగించడం వల్ల విద్యార్థులకు పాఠాలు సులువుగా బోధించవచ్చన్నారు. అనం తరం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మరోసారి మా తల్లిదండ్రు లను గుర్తు చేసుకోవడానికి మంచి అవకాశం కలిగిందని తెలి పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమ ణయ్య, ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, ఇమామ్ హుస్సేన్, సుధాకర్, సుభద్రా, వైఎస్ విజయ విద్యార్థులు పాల్గొన్నారు.



డిజిటల్ పరికరాలు ప్రారంభిస్తున్న శ్యామలమ్మ



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రెడ్డి

ఉద్యోగంతో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి- జమ్మలమడుగు

విద్యార్థులకు ఉద్యోగంతో ఉజ్వల భవిష్యత్తు అని డాక్టర్ యన్.కాళహస్తి, వెంకటేశ్వర్‌రెడ్డి (సాధన బ్యాంక్ కోచింగ్ సెంటర్) అన్నారు. శనివారం స్థానిక శ్రీనివాస డిగ్రీ కళా శాలలో విద్యార్థులకు భవిష్యత్ చదువులు, ఉద్యోగ విషయాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి ఒక్కరికీ ఉద్యోగ భద్రత తప్పదన్నారు. మంచి శిక్షణా కేంద్రాలు ఉన్నా యని వాటిని ఉపయోగించుకుని సమయాన్ని వృథా చేసుకో వద్దని చెప్పారు. విద్యార్థి దశ నుంచే పోటీపరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సూర్య నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ రామక్రిష్ణుడు, సెక్రటరీ రామ క్రిష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవిడ్‌రాజ్

ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- జమ్మలమడుగు

ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఎంపిక చేసినట్లు ఆ విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు దేవిడ్‌రాజ్ తెలిపారు. శనివారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఎంపిక జరిగింది. డివిజన్ అధ్యక్షులుగా అనిల్‌కుమార్, కార్యదర్శిగా ఎ.వినయ్‌కుమార్, డివిజన్ ఉపాధ్యక్షులుగా సుమంత్‌రెడ్డి, సుబహాన్‌బాబా, రాజశేఖర్ల, సురేష్, గురుప్రసాద్, మహేశ్, డివిజన్ సహాయ కార్యదర్శులుగా బద్రి, వల్లి, కౌశిక్, అరవింద్, చంద్ర, రమేశ్, డివిజన్ కమిటీ సభ్యులు విజయ్, పుష్పరాజ్, సత్య, ప్రసన్న, రాజేశ్, గణేష్, శ్రీను, లారెన్స్‌లు ఎంపికయ్యారని ఈ సందర్భంగా ఎన్నికైన వారు మాట్లా డుతూ విద్యార్థుల సమస్యలు పరిష్కారం కోసం నియోజక వర్గంలో రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత చదువు కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. జిల్లా కమిటీకి ఎన్నుకున్నం దుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ మీద నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు సమస్యలపై పోరాటం చేస్తామన్నారు.

నేడు మంత్రి 'ఆది' రాక

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు గ్రామ పంచాయతీకిసంబంధించి ఆదివారం బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించబోవు 5వ విడత జన్మభూమి మాఊరు గ్రామసభలో మంత్రి ఆదినారాయణరెడ్డి పాల్గొంటారని ఎంపిడిఒ మనోహర్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు ముగ్గుల పోటీలు, బాలబాలికలకు కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలింతలకు సీమంతాలు ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

కడప నగరంలోని హాస్పిటల్స్

తిరుమల హాస్పిటల్, 7 రోడ్లు	08562 - 222140
భారతి హాస్పిటల్, ఎర్రముక్కపల్లి	08562 - 257089
శ్రీ హాస్పిటల్, ద్వారకానగర్	08562 - 257499
ఉషారాణి హాస్పిటల్, ద్వారకానగర్	08562 - 245098
అరవింద్ కంటి ఆస్పత్రి, ఆర్.కె.నగర్	08562 - 246890
కొమ్మా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి	91000 13357
శ్రీమోహన్ హాస్పిటల్, ఆర్‌టిసి బస్టాండ్	08562 - 246171
సూర్య హాస్పిటల్, మారుతీనగర్	08562 - 251999
తులశమ్మ హాస్పిటల్, నాగరాజుపేట	08562 - 241550
అశ్వని చిన్నపిల్లల హాస్పిటల్, ద్వారకానగర్	98850 16122

నగరపాలక సంస్థ, నగర పంచాయతీ కమిషనర్లు

కడప	శివారెడ్డి	98499 05862
ప్రొద్దుటూరు	శేషన్న	98499 05863
ఎర్రగుంట్ల	విజయసింహారెడ్డి	90001 03129
పులివెందుల	మధుసూధన్‌రెడ్డి	98665 56180
మైదుకూరు	కృష్ణారెడ్డి	80085 59302
బద్వేలు	శివరామిరెడ్డి	99595 55838
జమ్మలమడుగు	లక్ష్మీరాజ్యం	98499 01670
రాయచోటి	ప్రసాదరాజు	99492 45670
రాజాంపేట	ఎం.వి. రమణారెడ్డి	99890 51971

వైసిపి నాయకులది అసత్య ప్రచారం : టిడిపి



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

ప్రజాశక్తి - కడపఅర్బన్

జన్మభూమి - మా ఊరూ కార్యక్రమ నిర్వహణపై వైసిపి నాయకులు అసత్యప్రచారం చేస్తున్నారని టిడిపి నాయకులు దుర్గాప్రసాద్ విమర్శించారు. శనివారం దుర్గా ట్రాక్టర్ వర్క్స్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24వ డివిజన్‌లో అత్యధికంగా ధనికులున్నారని చెప్పారు. అందుకే జన్మభూమి కార్యక్రమానికి తక్కువగా హాజరయ్యారని తెలిపారు. పేదలు, బడుగు బలహీన వర్గాలు ఉన్న చోట సమస్యలు ఉంటాయి కాబట్టి పరిష్కారం కోసం అధిక సంఖ్యలో హాజరవుతారని పేర్కొన్నారు. వైసిపి నాయకులు అసత్య ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. రైతులు, డ్వాక్రా మాహిళల గురించి మాట్లాడడేందుకు వైసిపి నాయకులు ఎలాంటి అవకాశం లేకపోవడంతో ఇళ్లు, ఇళ్ల స్థలాల విషయాన్ని ముందుకు తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 6.50లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఒకేసారి రెండులక్షల ఇళ్లకు ఒకేసారి గృహ ప్రవేశాలు చేసేందుకు ముఖ్యమంత్రి సన్నద్దమవుతున్నారని తెలిపారు. గతంలో మరుగుదొడ్లు కట్టకుండానే తల్లి, పిల్ల కాంగ్రెస్ నాయకులు నిధులు స్వాహా చేశారని విమర్శించారు. టిడిపి ప్రభుత్వం మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.15వేలు మంజూరు చేసి పూర్తి చేస్తుందని చెప్పారు. ఒడిఎఫ్ లేని రాష్ట్రంగా ముందుకు పోవాలని సిఎం కష్టపడుతున్నారన్నారు. విజయవాడ దుర్గ గుడిలో తాంత్రిక పూజలు నారా లోకేష్ సిఎం కావాలని 'బాబు' చేయించారని వైసిపి నాయకులు అనడం సిగ్గుచేటని పేర్కొన్నారు. సిఎం కమిటీ వేశారని ఇటువంటి తరుణంలో ఆలాంటి వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం అధికారంలోకి వచ్చేందుకు వైసిపి నాయకులు విమర్శి స్తున్నారని తెలిపారు. నగర శివార్లలో నిర్మిస్తున్న హజ్‌హౌస్‌లో రంజాన్ ప్రార్థలను చేయడానికి కమిటీ నిర్ణయం తీసుకుందని చెప్పారు. జగన్ మోహన్‌రెడ్డి ఇమాములకు, మౌజన్‌లకు రూ.10వేలు ఇస్తామని చెప్పడం హాస్యాస్పదమని పేర్కొనారు. కాపులను బిసిలో చేర్చే అంశంపై జగన్ ఏమి మాట్లాడడం లేదని తెలిపారు. నిరుద్యోగ భృతి జాబితాను తుదిదశకు తీసుకువచ్చారని చెప్పారు. సమావేశంలో మైనార్టీ నాయకులు నిజామ్ బుఖారీ, మోహిద్దీన్ సాహెబ్, బాషా మోహిద్దీన్, సుమన్ పాల్గొన్నారు.

నేడు ముదిరాజ్ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కడప అర్బన్: ముదిరాజ్ సేవా సంఘం క్యాలెండర్‌ను ఆదివారం టీచర్స్ భవన్‌లో ఆవిష్కరిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పి.నరసింహులు, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జగదీష్ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్య క్రమానికి కడప శాసనసభ్యులు అంజాద్‌బాష, మేయర్ సురేష్‌బాబు, తెలుగు దేశం పార్టీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులరెడ్డి, హరి ప్రసాద్, బిసి సంఘాల నాయకులు హాజరవుతున్నారు. జిల్లాలోని ముదిరాజ్ సోదరులందరూ హాజరై కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని వారు పేర్కొన్నారు.

18న ఎస్‌టి లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

కడపఅర్బన్: ఎస్‌టిఎపి 2017-18 సంవత్సరానికి సంబంధించి ఎన్‌ఎస్‌టిఎఫ్‌డిసి పథకం కింద ఇన్నోవా వాహనాలు, బొలెరో వాహనాల యూనిట్ల కొరకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ నెల 18న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమ అధికారి లలితాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జెసి ఛాంబర్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. హాజరయ్యే లబ్ధిదారులు తమ విద్యార్హత, కుల, ఆదాయ, ఆధార్, రేషన్‌కార్డ్, పాన్‌కార్డ్, బ్యాడ్జి నెంబరుతో కూడిన డ్రైవింగ్ లైసెన్స్ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు.

చికెన్ ధర



చికెన్ స్కిన్‌లెస్ కిలో రూ. 165

చికెన్ విత్ స్కిన్ కిలో : 145



కోడిగుడ్లు డజను రూ. 49/-

సినిమాలు

రవి : హలో, **సుధ** : మరణశాసనం, **ప్రతాప్** : 2 కంట్రీస్, **రమేష్** : సారథి, **మురళి** : ఒక్కక్షణం, **అమీర్** : అడ్వెంచర్, **తాహెర్** : సప్తగిరి ఎల్‌ఎల్‌బి, **రాజా(రహత్)** : ప్రోజెక్టు, **ఎస్‌ఆర్ (సాయిబాబా)**: ఎంసిఎ, **అప్సర** : జ్యూమంజి

కూరగాయల ధరలు

రకాలు	కిలో(రూ)
మటిక	20
టమోటా	06
బీన్స్	25
దొండకాయలు	24
క్యారెట్	50
కాలీఫ్లవర్ (ఒకటి)	34
కాకరకాయలు	16
పచ్చిమిర్చి	14
వంకాయలు	14
బెండకాయలు	18
బంగాళదుంపలు	18
చిక్కుడు	20
బీట్రూట్	26
అల్లం (పాతది)	48
అల్లం (కొత్తది)	48
ముల్లంగి	18
బీరకాయలు	18
అలసంద	20
మునగకాయలు (నాలుగు)	10
నిమ్మకాయలు (డజను)	10
కరివేపాకు (కట్ట)	01
కొత్తిమీర (కట్ట)	05
పొదీనా (కట్ట)	06

నగరంలోని పోలీస్ స్టేషన్ల ఫోన్ నెంబర్లు

పోలీస్ కంట్రోల్ రూము	100	గ్రామీణ	9440796907
డీఎస్పీ	9440796904	టుటౌన్	9440796990
వన్‌టౌన్	9440796905	సీసీఎస్	9440796917
చిన్నచౌకు	9440796911	రిమ్స్	9440901823

రైళ్ల రాకపోకల వివరాలు

కడప రైల్వేస్టేషన్ మీదుగా ప్రతిరోజు 19 రైళ్లు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇవి కాక మరో 10రైళ్లు వారానికి ఒకటి, రెండు లేక మూడుసార్లు ఈ రైల్వేస్టేషన్ గుండా వెళ్తుంటాయి. మొత్తంగా 29రైళ్లు వేలాది మంది ప్రయాణీకులను వారి గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. కడప రైల్వేస్టేషన్ కాలనిర్ణయ పట్టిక ఇదే.

వ. సం	రైలు నెం.	ఏరోజు	నుంచి	వరకు	వచ్చే సమయం	వెళ్లే సమయం
1.	16352	సోమ, శుక్ర	నాగర్‌కోయిల్	ముంబై	00.34	00.35
2.	17652	ప్రతి రోజు	కాచిగూడ	చెన్నయ్,ఎగ్మోర్	00.49	00.50
3.	17420	ప్రతి రోజు	హైదరాబాద్	తిరుపతి	02.44	02.45
4.	16734	గురువారం	ఓఖా	రామేశ్వరం	03.23	03.25
5.	17416	ప్రతి రోజు	కొల్హాపూర్	తిరుపతి	04.20	04.25
6.	11028	ప్రతి రోజు	చెన్నయ్	ముంబై	04.34	04.35
7.	12797	ప్రతి రోజు	కాచిగూడ	చిత్తూరు	04.38	04.40
8.	16382	ప్రతి రోజు	కన్యాకుమారి	ముంబై	06.28	06.30
9.	16351	బుధవారం	ముంబాయి	నాగర్‌కోయిల్	07.18	07.20
10.	12707	సోమ/బుధ/శుక్ర	తిరుపతి	నిజాముద్దీన	07.58	08.00
11.	57274	ప్రతి రోజు	తిరుపతి	హుబ్లీ ప్యాసింజర్	09.13	09.15
12.	11044	ఆదివారం	మధురై	లోకమాన్యతిలక	09.30	09.40
13.	11041	ప్రతి రోజు	ముంబై	చెన్నయ్	10.03	10.05
14	12164	ప్రతి రోజు	చెన్నయ్, ఎగ్మోర్	దాదార్	11.29	11.30
15.	16381	ప్రతి రోజు	ముంబై	కన్యాకుమారి	11.33	11.35
16.	16733	శనివారం	రామేశ్వరం	ఓఖా	13.53	13.55
17	12163	ప్రతి రోజు	దాదార్	చెన్నయ్, ఎగ్మోర్	14.08	14.10
18	07606	మంగళవారం	కాచిగూడ	మంగళూరు	14.41	14.42
19	56012	ప్రతి రోజు	కడప	అరక్కోణం	13.45	14.35
20	07675	గురువారం	మంగళూరు	కాచిగూడ	15.22	15.23
21	11042	ప్రతిరోజు	చెన్నయ్	ముంబై	17.04	17.05
22.	57273	ప్రతిరోజు	హుబ్లీ	తిరుపతి(ప్యాసింజరు)	17.04	17.05
23.	12708	సోమ/గురు/శని	నిజామొద్దీన్	తిరుపతి	18.33	18.35
24.	17430	ప్రతి రోజు	తిరుపతి	హైదరాబాదు	19.00	19.05
25.	11043	శుక్రవారం	లోకమాన్యతిలక్	మధురై	19.33	19.35
26	12798	ప్రతి రోజు	చిత్తూరు	కాచిగూడ (వెంకటాద్రి)	21.08	21.10
27	11027	ప్రతి రోజు	ముంబై	చెన్నయ్(మెయిల్)	21.33	21.35
28.	17651	ప్రతి రోజు	చెన్నయ్, ఎగ్మోర్	కాచిగూడ	22.14	22.15
29.	17415	ప్రతి రోజు	తిరుపతి	కోల్హాపూర్(హరిప్రియ)	23.38	23.40

కడప రైల్వేస్టేషన్ విచారణ కేంద్రం నెం. 08562-242131

కడప నుంచి ప్రధాన నగరాలకు వెళ్లే బస్సుల వేళలు

జిల్లా కేంద్రమైన కడప నుంచి రోజూ హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, చెన్నయ్, శ్రీశైలం, నెల్లూరు, అనంతపురం, కర్నూలు ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయపాలన వివరాలు ఇలా...

బస్సు	సమయం
హైదరాబాదు	
డీలక్స్	06.15
సూపర్ లగ్జరీ	08.30
సూపర్ లగ్జరీ	09.30
సూపర్ లగ్జరీ	10.30
సూపర్ లగ్జరీ	11.30
ఎక్స్‌ప్రెస్	14.30
సూపర్ లగ్జరీ	20.00
సూపర్ లగ్జరీ(బిహెచ్ఇఎల్)	20.30
సూపర్ లగ్జరీ (కెపిహెచ్‌బి)	21.00
సూపర్ లగ్జరీ (జెడిఎంటి)	21.30
సూపర్ లగ్జరీ (ఇసీఐఎల్)	22.00
ఇంద్ర	22.30
సూపర్‌లగ్జరీ	22.45
బెంగుళూరు	
సూపర్ లగ్జరీ	00.30
ఎక్స్‌ప్రెస్	04.30
ఎక్స్‌ప్రెస్	07.00
సూపర్ లగ్జరీ	07.40
సూపర్ లగ్జరీ	08.30
ఇంద్ర	10.30
సూపర్ లగ్జరీ	11.30
డీలక్స్	14.30
సూపర్ లగ్జరీ	20.15
సూపర్ లగ్జరీ	22.00
సూపర్ లగ్జరీ	22.15
సూపర్ లగ్జరీ	22.30
సూపర్ లగ్జరీ	22.45
సూపర్ లగ్జరీ	23.00
ఇంద్ర	23.30
విజయవాడ	
సూపర్ లగ్జరీ	08.00
సూపర్ లగ్జరీ	09.00
సూపర్ లగ్జరీ	10.30
సూపర్ లగ్జరీ	18.30
సూపర్ లగ్జరీ	20.00
ఇంద్ర	21.00
సూపర్ లగ్జరీ	21.30
సూపర్ లగ్జరీ	22.00
ఇంద్ర	22.15
చెన్నయ్	
సూపర్ లగ్జరీ	08.40
సూపర్ లగ్జరీ	11.30
సూపర్ లగ్జరీ	21.30
సూపర్ లగ్జరీ	22.30
సూపర్ లగ్జరీ	23.30

- **కడప నుంచి శ్రీశైలంకు ఎక్స్‌ప్రెస్ ఉదయం 5.30, మధ్యాహ్నం 13.30 గంటలకు**
- **కడప నుంచి నెల్లూరు :** ఉదయం 4,00, 5.00, 6.00, 6.30, 7.00, 8.00, 8.30, 9.15, 10.00, 10.30, 11.00, 11.30, మధ్యాహ్నం 12.30, 1.30, 2.00, 2.30, 3.00, 3.30, 4.00, 4.30, 5.00, సాయంత్రం 6.00, 6.30గంటలకు
- **అనంతపురం :** ఉదయం 4.30, 5.00, 5.30, 6.30, 7.00, 8.00, 8.40, 9.00, 9.45, 10.25, 10.45, 11.15, 11.30, మధ్యాహ్నం 12.00, 12.20, 1.00, 1.30, 2.00, 2.15, 2.20, 3.15, 3.30, 4.30, సాయంత్రం 5.00, 5.15, 6.30, 7.30
- **కడప నుంచి కర్నూలు :** అర్ధరాత్రి 12.30, 12.45, 1.00, 1.30, 1.45, 2.00, 2.15, 2.45, 3.00, 3.20, 3.30, 3.45, ఉదయం 4.00, 4.30, 5.30, 6.00, 7.30, 8.00, 8.45, 9.00, 9.45, 10.00, 10.30, 10.45, 11.15, 11.30, 11.45, మధ్యాహ్నం 12.00, 12.30, 1.00, 1.20, 1.45, 2.00, 2.30, 3.30, 4.00, 4.30, 5.00, 5.30, రాత్రి 11.15. 11.35

విచారణ కేంద్రం ఫోన్ నెంబరు 08562-244160

ప్రమాదాలకు నిలయంగా కంపచెట్లు



రోడ్డుకు ఇరువైపులా వేపుగా పెరిగిన కంపచెట్లు

ప్రజాశక్తి - ఓబులవారిపల్లె

మండలంలోని పలు గ్రామాల్లో కంపచెట్లు వేపుగా పెరగడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ సమస్యతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓబులవారిపల్లె నుండి గాదెల వరకు కొత్తపల్లి, అరుంధతివాడ మీదుగా చెన్నరాజుపోడు నుండి అనంతరాజంపేట వద్దకు వెళ్లేదారిలో 20కి పైగా ప్రమాదకర మలుపులున్నాయి. ఈ మధ్య కాలంలో అనేక ప్రమాదాలు జరిగి కొందరు ప్రాణాలు కోల్పోయారు. మరి కొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రాంతం నుంచే వెళ్లాలంటే వాహనాదారులు జంకుతున్నారు. ఏ నిమిషానికి ఏ ప్రమాదం జరుగుతుందో అని భయాందోళనలకు గురవుతున్నారు. ఈ ప్రాంతమంతా ముళ్ల పొదలతో నిండిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలకు నిలయంగా ఈ రహదారి ఏర్పడింది. ఇలా మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లన్ని కంపచెట్లతో అల్లకుపోయాయి. ప్రమాదాలు జరుగుతున్న సంబంధిత అధికారులు సూచక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం శోచనీయం.కొత్త వ్యక్తులు ఈ మలుపులు తెలియక ప్రమాదాల భారీన పడుతున్నారు. రోడ్డు కూడా గుంతలమయం కావడంతో వాహనాలదారు ఇబ్బందులు అన్నిఇన్ని కావు. వీటిపై ఆర్అండ్బి, పంచాయతీ అధికారులు, సర్పంచ్లు పట్టించుకున్న పాపాన పోలేదని మండల ప్రజలు విమర్శిస్తున్నారు.అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, కంపచెట్లు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ః

జన్మభూమిలో నిరసనల వెల్లువ

ప్రజాశక్తి - పోరుమామిళ్ళ

పట్టణంలో పంచాయతీ కార్యాయలంలో నిర్వహించిన ఐదో విడత జన్మభూమి కార్యక్రమానికి అడుగడుగునా నిరసనలు ఎదురయ్యాయి. సమస్యలు పరిష్కారం కాలేదని మూలవీధికి చెందిన కాశయ్య అనే వ్యక్తి ఏకంగా పెట్రోల్ పోసుకొని నిరసన తెలపడానికి ప్రయత్నించగా ముందస్తుగా పోలీసులు గుర్తించి అతణ్ణి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఎఐటియుసి మండల కార్యదర్శి మస్తాన్ జన్మభూమి కార్యక్రమాన్ని అడ్డుకున్నారు పేద కార్మికుల సమస్యలను పరిష్కరించని తహశీల్దార్ను వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే జయరాములు హాజరయ్యారు. కార్యక్రమంలో జడ్పిటిసి శారదమ్మ, తహశీల్దార్ శేష రాంసింగ్, ఎంపిడిఒ రామకృష్ణయ్య, ఇఒపిఆర్డి ముజఫర్ రహీం, సర్పంచ్ అజీజ్, స్పెషల్ ఆఫీసర్ కృష్ణమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

రాజంపేట : నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.600 కోట్లు కేటాయించారని ప్రభుత్వ విప్ మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం కూచివారిపల్లెలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు కార్యక్రమంలో టిడిపి జిల్లా మహిళ అధ్యక్షురాలు ఎం.శ్రీవాణి, మండల స్పెషల్ ఆఫీసర్ బాలాజీ, పాల్గొన్నారు.

నందలూరు :మండలంలోని పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులగా రాజంపేట డిఎస్పి లక్ష్మీనారాయణ, ఆర్డిఒ వీరబ్రహ్మం హజరయ్యారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్, ఎగ్జిబిషన్లు, పౌష్టికాహారాలను పరిశీలించడంతో పాటు కబాడ్డీ పోటీలను ప్రారంభించి ముగ్గులలో విజేతలను నిర్ణయించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ఎంపిపి మేడా పద్మజ, సింగిల్విండో అధ్యక్షులు మేడా విజయభాస్కర్రెడ్డి, జడ్పిటిసి శివరామరాజు, సర్పంచ్ లక్ష్మీదేవి, సుధాకంరెడ్డి, శ్రీనివాసులు, ఇలియాస్, అన్సర్, మోహన్రెడ్డి, తహశీల్దార్ దార్ల చంద్రశేఖర్, ఎంపిడిఒ మల్లీశ్వరి, ఇఒఆర్డి ప్రసాద్, ఐకెపిఎపిఎం సంజీవరాజు, పాల్గొన్నారు.

సిద్దవటం : మండల పరిధిలోని ఎస్.రాజంపేట, వంతాటిపల్లె గ్రామాల్లో నిర్వహించారు. వంతాటిపల్లె లోని గ్రామసభలో కొంతమంది గ్రామస్తులు మాట్లాడుతూ రేషన్ కార్డులు మంజూరు కాలేదని అధికారులపై మండిపడ్డారు. ఇటీవల అనంతరం వంతాటిపల్లె, ఎస్.రాజంపేట పాఠశాల విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు. వీరికి ప్రత్యేక అధికారి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి వెంకటసుబ్బారావు, తహశీల్దార్ చంద్రశేఖర్రెడ్డి, ఎంపిడిఒ జయసింహ, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, దార్ల పద్మావతి, పాల్గొన్నారు.

కలసపాడు :లింగారెడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని ఐదు అంగన్వాడీ కేంద్రాలకు రూ.5 వేలు విలువ చేసే వంట పాత్రను, ప్లేట్లు, గ్లాస్లు, రెండు బిందెలు, రెండు చాపలు, ఒక బకెట్, మగ్గులను పంపిణీ చేశామని పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ శివప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక సచివాలయంలో ఏర్పాటు చేసిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఎంపిడిఒ మైథలీ గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజేంద్ర, స్పెషల్ ఆఫీసర్ శివప్రాసద్, ఆర్ఐ సిద్దేశ్వరయ్య, అంగన్వాడీ సూపర్వైజర్ సువర్ణ; సర్పంచ్ రంగారెడ్డి, పంచాయతీ సెక్రటరీ



సిద్దవటంలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

జగన్, ఎపిఎం గంగార్జున, ఎపిఒ గంగయ్య, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ ఓబన్న, పంచాయతీరాజ్ ఎఇ వెంకటరత్నం, ఫారెస్టు ఆఫీసర్ విజయలక్ష్మీ, డీలర్లు తిరుమలరెడ్డి, విఆర్ఒ రామకృష్ణంరెడ్డిలు పాల్గొన్నారు.

బద్వేలు: చిన్న కేశంపల్లె గ్రామంలో నిర్వహించిన జన్మభూమి సభలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలంటూ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయ్కుమార్ ఆద్వర్యంలో అధికారులకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, ఉన్నత పాఠశాలల్లో అన్ని పండిట్, పిఇటి పోస్టులను అప్గ్రేడ్ చేయాలని డిమాండ్చేశారు. కార్యక్రమంలో శశిధర్కుమార్, బద్వేలు మండల ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్, పాఠశాల ప్రధానోపాద్యాయులు రామసుబ్బయ్య, సురేష్బాబు, సురేష్, పాల్గొన్నారు.

కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సిబ్బంది కృష్ణంరాజు, వెంకటేష్, శివకుమార్యాదవ్, వెంకటరెడ్డి, నాగేశ్వరరావు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఉమామహేశ్వరరెడ్డి

పంచాయతీ సిబ్బందికి దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - చిట్వేలి

గ్రామ పంచాయతీ కార్యాలయ సిబ్బందికి సర్పంచ్ ఉమామహేశ్వరరెడ్డి శనివారం సంక్రాంతి సందర్భంగా దుస్తులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు అధిక ప్రాముఖ్యత ఉందని పండుగను ప్రతి ఒక్కరూ ధనిక పేద, అనే భేదాలు లేకుండా సంతోషంగా జరుపుకోవాలనే ఉదేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సమాజంలో కుల మత బేధాలు ఉండకూడదని సూచించారు.

జిల్లా పరిషత్ పాఠశాలలో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి - ఓబులవారిపల్లె

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వచ్ఛభారత్పై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించుకోవాలని విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు సూచించారు. గ్రామాలలోని పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచాలన్నారు. జనవరి 30లోగా ప్రతి ఇంటికీ మరుగు దొడ్డి నిర్మించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి శుద్ధి కేంద్రంతో ప్రజలకు తాగునీరు

ప్రజాశక్తి - కలసపాడు

మండలంలోని లింగారెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో మినరల్ వాటర్ప్లాంట్ను వెంటనే తయారు చేసి ప్రజలకు నీరందించాలని ఆర్డబ్ల్యుఎస్ ఎఇ ఓబన్న సర్పంచ్ రంగారెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వాటర్షెడ్ పథకం 2010-11 సంవత్సరంలో సుమారు రూ.4,19,500, ప్రజల భాగస్వామ్యంతో రూ. 83,900 కలిసి అప్పటి ఎమ్మెల్యే కమలమ్మ చేతులు మీదుగా ప్రారంభోత్సవం చేశారన్నారు. ఈ విషయంపై వెంటనే సంబంధిత అధికారులు స్పందించి త్వరలోనే ఓవర్హెడ్ ట్యాంక్కు నీరందించాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగారెడ్డి, స్పెషల్ ఆఫీసర్ శివప్రసాద్, తహశీల్దార్ రాజేంద్ర, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ ఓబన్నలు పాల్గొన్నారు.

లారీ, పాల వ్యాను ఢీ

ప్రజాశక్తి - ఓబులవారిపల్లె

మండలంలోని ముక్కవారిపల్లె సమీపంలో బిడ్జిపైన లారీ, పాల వ్యాను శనివారం ఢీ కొన్నాయి. ఈ ఘటనలో పాల వ్యాన్ ముందుభాగం నుజ్జు అయింది. అందులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకొన్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని లారీ డ్రైవర్ను అదుపులోకి తీసుకొన్నారు. ఈ ప్రాంతంలోనే ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయని వెంటనే ఈ ప్రాంతంలో స్పీడు బేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దుర్గాప్రసాద్

ఎర్రచందనంపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - పోరుమామిళ్ళ

మండలంలోని టేకూరుపేట గ్రామంలో ఎర్రచందనంపై అక్రమ రవాణ నిరోధక కార్యదళం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని టాస్క్ఫోర్స్ డిప్యూటీ రేంజ్ అధికారి దుర్గాప్రసాద్, శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత విలువైన అటవీసంపద ఎర్రచందనం అని అన్నారు. స్వార్థపరులు అటవీసంపదను కొల్లగొట్టాలని ప్రయత్నించడం అన్యాయమని చెప్పారు. గ్రామాలలో ఎవరైనా ఎర్రచందనం కొట్టే వారు కనబడితే వెంటనే అటవీ సిబ్బందికి తెలియజేయాలన్నారు.

బావిలోపడి మహిళ మృతి

ప్రజాశక్తి - సిద్దవటం

మండల పరిధిలోని మాచుపల్లెకి చెందిన పెసల హేమలత (24) అదుపు తప్పి బావిలో పడి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. మృతురాలు పొలాల వద్దకు పోయ్యేందుకు ప్రతి రోజులాగే పొలా గట్లమీదుగా నడిచి వెళ్తున్న సమయంలో పొలం గట్టు పక్కనే ఉండడంతో ప్రమాద వశాత్తు కాలు జారీ బావిలో పడింది. అదే గ్రామానికి చెందిన రైతులు గమనించి హుటా హుటిన హేమలతను బావిలో నుంచి బయటకు తీయగా అప్పటికే మృతి చెందింది. మృతురాలికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని తహశీల్దార్ చంద్రశేఖర్రెడ్డి పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్సుకు తరలించామని ఎస్ఐ అరుణ్రెడ్డి తెలిపారు.

పాత పెన్షన్ అమలు కోసం 9న ధర్నా

ప్రజాశక్తి - రాజంపేట

పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 9న మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని తాలూకా కేంద్రాలలో నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్యుపిపి (రాష్ట్రీయ పండిత పరిషత్) జిల్లా అధ్యక్షులు ఎ.నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ప్రభుత్వ పాఠశాలలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు, ఎన్జిఒ సంఘాలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అదనపు కార్యదర్శి బి.శివారెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ, సత్తాజ్ హుసేన్, నారాయణరాజు, రామగంగిరెడ్డి, నాగరాయణ, ఓబయ్య, జ్యోతిర్మయి, జయంతి, కరిముల్లా, దావూ నాయక్లు పాల్గొన్నారు.

నేడు ఎపిఎండిసి ఎమ్డి రాక

ప్రజాశక్తి - ఓబులవారిపల్లె

మండల పరిధిలోని మంగంపేట, గోవిందంపల్లె జన్మభూమి-మా ఊరు కార్యక్రమానికి ఎపిఎండిసి ఎమ్డి వెంకయ్యాచౌదరి రానున్నారని సిపిఒ కేధార్నాథ్రెడ్డి చెప్పారు. అదే విధంగా కలెక్టర్ బాబురావునాయుడు, జిల్లా ఇన్ఛార్జి వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రశేఖర్రెడ్డి, పలువురు రాజకీయ నాయకులు, అధికారులు వస్తారన్నారు. మంగంపేటలోని ఎపిఎండి సంస్థ 5కె రన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ రన్లో ఎపిఎండిసి ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో ముగ్గుల పోటీలు

పోరుమామిళ్ళ :పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహిం చామని ప్రధానోపాధ్యాయుడు రఘునాధరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరుమామిళ్ళలో 5వ విడత జన్మభూ మి కార్యక్రమం జరుగుతున్న సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించామన్నారు. ప్రతిభ కనభరిచిన సుమతి, శిరీషా, సాయిదీప్చంద్లకు బహుమతులు ప్రధానం చేశామన్నారు.



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పట్టణ శివారు ప్రాంతంలోని శ్రీసాయిరాజేశ్వరి ఇన్స్టిట్యూట్ఆఫ్ టెక్నాలజి కళాశాలలో శనివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. ఎస్ఆర్ఐటి ఆధ్వర్యంలో హైదరాబాద్కు చెందిన యుబిఇ ఇండస్ట్రీస్ సౌజన్యంతో సాంప్రదాయబద్ధంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ బసిరెడ్డి వీరకళ్యాణ్రెడ్డి మాట్లాడుతూ 10, ఇంటర్, డిప్లమా, విద్యార్థిని విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ముగ్గుల పోటీలు నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 800మంది విద్యార్థులు పాల్గొని ఉత్సాహంగా గడిపారన్నారు. హైదరాబాద్కు చెందిన సంస్థ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం రాయలసీమలో ప్రథమం అన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్రెడ్డి, వైస్ప్రెసిడెంట్ వీరకుమార్రెడ్డి, ప్రిన్సిపల్ వీరసుదర్శన్రెడ్డి, అద్యాపకులు పాల్గొన్నారు.

22వ రోజుకు నిరసనలు

ప్రజాశక్తి - యర్రగుంట్ల

ఆర్టిపిపిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల నిరసనలు శనివారం 22వ రోజుకు చేరుకున్నాయి. రోజూ మెయిన్గేటు వద్ద నిరసన వ్యక్తం చేసి నల్లబ్యాడ్జిలతో విధులకు హాజరవుతున్నారు. యాజమాన్యం స్పందించి తమకు న్యాయం జరిగే వరకు ఆందోళనలు కొనసాగుతాయని కార్మికుల జెఎసి చైర్మన్ పుల్లారెడ్డి అన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు , కార్మికులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వివరించండి

యర్రగుంట్ల :ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అర్థమయ్యేలా క్లుప్తంగా వివరించాలని మంత్రి ఆదినారాయణ రెడ్డి చెప్పారు. జడ్పి బాలుర పాఠశాల క్రీడామైదానంలో శనివారం 11, 12వార్డులకు సంబంధించి జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే జన్మభూమి-మాఊరు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ముసలయ్య మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి మంత్రి ఆది ప్రత్యేక కృషి చేశారని వివరించారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువనుంచి ప్రొద్దుటూరు వరకు బైపాస్ రోడ్డు నిర్మాణానికి కృషి చేశారని తెలిపారు. కమిషనర్ విజయ సింహారెడ్డి మాట్లాడుతూ పట్టణంలో 24గంటలు నీరు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మహేశ్వర్రెడ్డి, కౌన్సిలర్ గైబున్నీసా, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

ప్రజాశక్తి - ముద్దనూరు

విచ్చలవిడిగా ఇంధనాన్ని వినియోగం వల్ల వచ్చే కాలుష్యం నుంచి పర్యావరణాన్ని కాపాడుదామని ఎపిఎస్పిఎఫ్ తిరుపతి హెడ్క్వార్టర్స్ కమాండెంట్ వి.వి. రామిరెడ్డి అన్నారు. శనివారం తాడిపత్రి రహదారిలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీకళాశాల నుండి కడప నుండి ఆర్టీపిపి ముద్దనూరు మీదుగా కొండాపురం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పర్యావరణాన్ని రక్షించేందుకు మొక్కలు నాటాలన్నారు. ముద్దనూరు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కాలేజి వద్దకు చేరుకోగా ఎస్ఐ నరసింహారెడ్డి సిబ్బందితో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎస్పిఎఫ్ ఇన్స్పెక్టర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమిలో ప్రజా సమస్యలపై నిలదీస్తాం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

- ఎంపీ, జడ్పి చైర్మన్ను అవమానించడం దుర్మార్గం
- టిడిపి జన్మభూమిగా మార్చారు



సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

ప్రజాశక్తి - కడపఅర్బన్

ప్రభుత్వ నిర్వహిస్తున్న జన్మభూమి - మా ఊరు క్రమంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని, గత జన్మభూమిలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రజల చేత నాయకులను నిలదీయిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.ఆంజనేయులు పేర్కొన్నారు. శనివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు పులివెందులకు వచ్చిన సందర్భంగా ఎంపి అవినాష్రెడ్డి పట్ల పులివెందుల సభలో సిఎం సభలో అవమానించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రోటోకాల్ పాటించడంలో దళిత జడ్పి చైర్మన్ గూడూరు రవికి అవమానం జరిగిందని తెలిపారు. ప్రజాస్వామ్యం గురించి విపరీతంగా చెప్పే సిఎం జన్మభూమి సభలో ఆ ప్రజాస్వామ్యాన్నే ఖూనీ చేశారని విమర్శించారు. జన్మభూమి ప్రభుత్వ కార్యక్రమమని, టిడిపి ప్రయివేట్ కార్యక్రమం కాదని తెలిపారు. ఇందులో స్వేచ్ఛగా ప్రజలు మాట్లాడించే అవకాశం ఇవ్వాలన్నారు. టిడిపి అధికారంలోకి జన్మభూమిలో ఎన్నో హామీలు ఇచ్చారని, వినతి పత్రాలు స్వీకరించారని చెప్పారు. రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇళ్ల స్థలాలు పేద ప్రజలకు ప్రధానమైనవని పేర్కొన్నారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోమన్నారని, జాబితాలో పేర్లు వచ్చిన తరువాత నెలల తరబడి రెవెన్యూ అధికారులు పట్టాలు ఇవ్వడం లేదని చెప్పారు. నగరంలోని శివారు కాలనీల్లో తాహశీల్దారు ఒక్కరికి కూడా పట్టాలు ఇవ్వలేదని విమర్శించారు. బద్వేల్ టౌన్లో సిమాక్ ఆసుపత్రి కోసం 58 పట్టాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని పేర్కొన్నారు. ఇంతవరకు ఒక్కరికి మరోచోట పట్టా ఇవ్వలేదని చెప్పారు. సిపిఎం కలెక్టర్కు, ఆర్డిఒలు, తహశీల్దార్లకు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని తెలిపారు. కాశీనాయన మండలంలో 12వేల ఎకరాల భూమి ఆక్రమణకు గురైందని పేర్కొన్నారు. ఒంటిమిట్ట, బ్రహ్మంగారి మఠంలో భూములు కబ్జాకు గురయ్యాయని తెలిపారు. కాశీనాయన మండలంలో ఆక్రమణకు గురైన భూములపై ఏర్పాటు చేసిన విచారణ కమిటీ రిపోర్టును బహిర్గదం చేయలేదని చెప్పారు. భూపోరాటాలు ప్రజలు ఎక్కడ చేసినా అక్కడకు వెళ్లి సంపూర్ణ మద్దతు ఇస్తుం దన్నారు. టిడిపి ఇంటింటి కార్యక్రమం నిర్వహించిందని దీనికి పార్టీ నిధులు ఖర్చు చేశారని పేర్కొన్నారు. ఇప్పుడు జన్మభూమి పేరుతో టిడిపి ప్రచారాన్ని ప్రభుత్వ ఖర్చుతో చేస్తున్నారని విమర్శించారు. కలెక్టర్ బాబురావు నాయుడు ఆధ్వర్యంలో ఇది కొనసాగడం దారుణమని చెప్పారు. ప్రజాప్రతినిధులు కానివారు వేదికపై కూర్చొంటున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధులు కానివారు వేదికపై ఉంటే తాము కూడా వెళ్లి కూర్చొంటామని హెచ్చరించారు. జన్మభూమి కార్యక్రమాలో నృత్యాలు, ఉత్తుత్తి మాటాలు చెప్పి పోతేఎలా అని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ జన్మభూమి కలెక్టర్ నిర్వహించాలి, టిడిపి నిధులైతే అడగమని పేర్కొ న్నారు. జన్మభూమి కమిటీ సభ్యులకు పండుగలా ఉంద న్నారు. దీనికి కలెక్టర్ నాయకత్వం వహించడం ఉపయోగంగా ఉండదని చెప్పారు. సోమవారం నుంచి జరిగే జన్మభూమిలో ఎక్కడికక్కడ ప్రజలకు మేలుచేయాలని నిలదీస్తా మని, ప్రజల చేత అడ్డుకునే కార్యక్రమం చేపడతామని తెలిపారు. టిడిపి జన్మభూమిగా మార్చారని ప్రజల చేతనే అడిగిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.చంద్రశేఖర్, నగర కార్యదర్శి ఎ.రామమోహన్ పాల్గొన్నారు.

క్రీడాల అభివృద్ధికి కృషి : చైర్మన్ తోట కృష్ణ



మాట్లాడుతున్న తోటకృష్ణ

ప్రజాశక్తి - కడపఅర్బన్

జిల్లాలో క్రీడాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని ఒలంపిక్ సంఘం అడహక్ కమిటీ చైర్మన్ తోటకృష్ణ అన్నారు. శనివారం తోట కృష్ణ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంఘానికి గుర్తింపు ఉందని చెప్పారు. 2019 ఏప్రిల్ వరకు గడువు ఉందని తెలిపారు. కోర్టు తీర్పు కూడా తమకు అనుకూలంగా వచ్చిందని పేర్కొన్నారు. జిల్లా జిల్లా వారితో సంఘాన్ని ఎన్నుకున్నామని చెప్పారు. శాప్, ప్రభుత్వం నుంచి గుర్తింపు ఉందన్నారు. కొంత మంది తమకు గుర్తింపు లేదని ప్రచారం చేయడం సరికాదని పేర్కొ న్నారు. పదవులు ఉన్నా, లేకున్నా తాము క్రీడల అభివృద్ధికి పాటుపడతామని తెలిపారు. సమావేశంలో కమిటీ కన్వీనర్ ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, నాయకులు సునీల్, విజయ భాస్కర్రెడ్డి, జనార్ధన్, ప్రసాద్, ప్రతాప్ పాల్గొన్నారు.

బహిరంగ మలవిసర్జన వద్దని ర్యాలీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

బహిరంగంగా మలవిసర్జన చేయకూడదని స్వచ్ఛభారత్లో భాగంగా మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో డిఎస్పీ కృష్ణ, పెద్దముడియం ఎస్ఐ హరిప్రసాద్, తుంగభద్రహైలెవల్ చైర్మన్ ఎంబి శ్రీనివాసులరెడ్డి ఆద్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో భాగంగా డప్పు వాయిద్యాలతో వీధిల్లో తిరుగుతూ ప్రతి ఇంటి వద్దకు వెళ్ళి బహిరంగ మలవిసర్జన వల్ల తలెత్తే సమస్యలను గ్రామ ప్రజలకు తెలియజేశారు. గ్రామ స్థాయి నుంచి పరిశుభ్రతను పాటిస్తే దేశస్థాయిలో స్వచ్ఛభారత్ విజయవంతం అవుతుందని డిఎస్పీ కృష్ణ తెలిపారు. శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఉప్పలపాడు ఆదర్శ గ్రామంగా పిలువబడుతోందన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించినట్లు తెలిపారు. మరుగుదొడ్లను ప్రతి ఒక్కరు వినియోగించుకొని బహిరంగ మలవిసర్జన వల్ల కలిగే అనర్థాలను, అనారోగ్య సమస్యలను ప్రజలకు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

జాతీయ క్రీడల్లో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సుబ్బనరసయ్య

ప్రజాశక్తి - కడపఅర్బన్

ప్రభుత్వ పురుష కళాశాల కడపలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు శ్రీకాంత్, ఉపేంద్ర జాతీయ స్థాయి డ్రాప్ రోబార్ చాంపియన్ షిప్లో ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్బనరసయ్య తెలిపారు. శనివారం ఆయన ఛాంబర్లో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ మహారాష్ట్ర డ్రాప్ రోబార్ ఛాంపియన్ షిప్ పోటీలు ఈ నెల 28 నుంచి 31 వరకు నిర్వ హించారని పేర్కొన్నారు. రాష్ట్ర జట్టుకు ప్రాతినిద్యం వహించారని చెప్పారు. అందులో ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. మంచి ప్రతిభను కనబరచి అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. తమ కళాశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వ్యాయామ అధ్యాపకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.